నాలుగో రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

విశాలాంధ్ర-తాడేపల్లి : మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంటు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె శుక్రవారం నాలుగో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆదేశాల మేరకు పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు సమ్మె వలన పట్టణంలో పారిశుధ్య పనులు అటకెక్కాయని అన్నారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన కోరికలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మెకు సంఘీభావం తెలిపిన వారిలో టీడీపీ తాడేపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి దారా దాసు, అద్దంకి మురళి, ఓలేటి రాము, జుంజు మరియదాసు, కేళి వెంకటేశ్వరరావు, తోట సాంబశివరావు, ఇట్టా భాస్కర్, చాంద్ బాషా, నాగుల్ మీరా, మండవ గోపాలరావు, జి.నాగేశ్వరరావు, అన్నెం కుసుమ, మాలిక, అక్కల చెన్నయ్య, ఇల్యాజ్, చిన్న దుర్గారావు, సూరగాని కిరణ్, షేక్ కరిముల్లా తదితరులు పాల్గొన్నారు.

బడిగంచుల కోటేశ్వరరావుకు ఘన నివాళి

విశాలాంధ్ర-మంగళగిరి : నవులూరు గ్రామ సీపీఐ సీనియర్ కామ్రేడ్ బడిగంచుల కోటేశ్వరరావు(82) అనారోగ్య కారణంగా శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఆయన మృతదేహానికి సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య పార్టీ పతాకాన్ని కప్పి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, నవులూరు సీపీఐ శాఖ మాజీ కార్యదర్శి గోహార్ జానీ, సీపీఐ గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

1న క్యాన్సర్ వ్యాధిపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-గుంటూరు : జిల్లా సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఓవర్ బ్రిడ్జి క్రింద పోలీస్ క్లబ్ రోడ్డు, ఆర్పీఎఫ్ బ్యారెక్స్ వద్ద గల సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా కార్యాలయంలో సీనియర్ సిటిజన్స్ కోసం జనవరి 1న క్యాన్సర్ వ్యాధిపై ఉచిత అవగాహన శిబిరం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షులు బైసాని కైలాసనాద్, కార్యదర్శి వి.రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి క్యాన్సర్ విభాగాధిపతి ప్రొఫెసర్ డాక్టర్ జి.దుర్గాప్రసాద్ ఈ వైద్య శిబిరంలో పాల్గొని సీనియర్ సిటిజన్స్ క్యాన్సర్ మహమ్మారి బారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రసంగిస్తారని, నగరంలోని సీనియర్ సిటిజన్స్ తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అంగన్‌వాడీల వినూత్న నిరసన

విశాలాంధ్ర-తాడేపల్లి : అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు, రిటైర్డ్ బెనిఫిట్స్, పెన్షన్ తదితర సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు చేస్తున్న సమ్మె శుక్రవారం 18వ రోజుకు చేరుకుంది. తాడేపల్లి మండల కేంద్రం నులకపేట తహశీల్థార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు సమ్మె శిబిరం వద్ద ఉరితాడుతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సమ్మెకు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) మంగళగిరి ప్రాజెక్ట్ గౌరవాధ్యక్షులు వేముల దుర్గారావు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు సరళ, తబితా, కిరణ్మయ్, మాణిక్యం, శ్రీదేవి, భవాని, సుజాత, లక్ష్మి, శోభా, వరలక్ష్మి, ఫాతిమా, మాధూరి నాయకత్వం వహించారు.

సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతా..

విశాలాంధ్ర-తాడికొండ : అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారం అయ్యేందుకు తమ వంతుగా పూర్తిగా సహకారం అందిస్తానని ప్రత్తిపాడు శాసనసభ్యులు, తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేకతోటి సుచరిత హామీ ఇచ్చారు. ఈ నెల 30న తాడికొండలో సామాజిక సాధికార బస్సు యాత్ర జరుగుతున్న నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించేందుకు సుచరితతో పాటు ఎంపీ అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, నియోజకవర్గ పరిశీలకులు బత్తుల బ్రహ్మారెడ్డి, మేకతోటి దయాసాగర్ శుక్రవారం తాడికొండ బస్టాండ్ వద్దకు వచ్చారు. విషయం తెలుసుకున్న అంగన్‌వాడీలు, హెల్పర్లు వైసీపీ నేతలను చుట్టుముట్టి తమ సమస్యలను ఏకరువు పెట్టారు. స్పందించిన నేతలు మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేందుకు కృషి చేస్తామని, పైవారు హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. కార్యక్రమానికి సీఐటీయూ నాయకులు ఎడ్లపల్లి గాంధీ రామ్మోహన్రావు, రైతు సంఘం నాయకులు చింతల భాస్కర్ రావు నాయకత్వం వహించారు.

నవులూరుకు తాగునీరు సరఫరా

విశాలాంధ్ర-మంగళగిరి : టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సహకారంతో నవులూరు గ్రామానికి వాటర్ ట్యాంకర్ ద్వారా శుక్రవారం తాగునీటిని సరఫరా చేయించారు. తాగునీటి కోసం ప్రజలు ఇబ్బంది పడుతుండటంతో పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న లోకేష్ వెంటనే స్పందించారు. జలధార పేరుతో మంచినీటి ట్యాంకర్‌ను పంపించి తాగునీటిని సరఫరా చేయించారు. వాటర్ ట్యాంకర్‌ను పంపి తాగునీటిని సరఫరా చేయించిన నారా లోకేష్‌కు నవులూరు నివాసితులు కృతజ్ఞతలు తెలిపారు.

20న లిటిల్ విలేజ్ సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-మంగళగిరి : 2024 జనవరి 20వ తేదీన ఉదయం 11 గంటలకు చినకాకానిలోని లిటిల్ విలేజ్ హోటల్‌లో గల మినీ మీటింగ్ హాల్‌లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంగళగిరి సబ్ బ్రాంచ్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మంగళగిరి చైర్మన్ అనిల్ చక్రవర్తి శుక్రవారం తెలిపారు. సొసైటీ మంగళగిరి సబ్ బ్రాంచ్ గౌరవాధ్యక్షులు తహశీల్దార్ జీవీ రాంప్రసాద్ అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందని, సభ్యులందరూ హాజరుకావాలని ఈ సందర్భంగా అనిల్ చక్రవర్తి విజ్ఞప్తి చేశారు.

పట్టణంలో పేరుకుపోయిన చెత్త

విశాలాంధ్ర-తాడేపల్లి : పారిశుధ్య కార్మికుల సమ్మె కారణంగా చెత్త దుర్వాసనతో పేరుకుపోయింది. తమకేమీ పట్టనట్టు అధికారులు వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వంతో జరిగిన చర్చలు సఫలం కాకపోవటంతో సమ్మెను పారిశుద్ధ కార్మికులు ఉధృతం చేశారు. అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మెలో ఉన్నప్పుడు అంగన్‌వాడీ కేంద్రాల తాళాలు పగలకొట్టడానికి చూపిన శ్రద్ధ ఇప్పుడు చెత్త తీయటానికి కూడా అధికారులు అదే శ్రద్ధచూపాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఈ చెత్త ఎప్పుడు పోతుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

31లోపు పన్ను చెల్లించకుంటే వడ్డీ తప్పదు

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: వడ్డీ లేకుండా ప్రస్తుత అర్ధ సంవత్సరానికి ఆస్తి పన్ను చెల్లించే అవకాశం 2 రోజులు మాత్రమే ఉందని, పన్ను చెల్లింపుదార్లకు అనుకూలంగా క్యాష్ కౌంటర్లు ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు పని చేస్తాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలియచేశారు. వచ్చే నెల జనవరి 1 నుండి పన్ను బకాయిపై వడ్డీ విధించబడుతుందని తెలిపారు. ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలం పన్ను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు.

మద్య నిషేధ హామీ నీటి బుడగేనా..?

విశాలాంధ్ర-గుంటూరు : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రాకముందు మద్యపానాన్ని పూర్తిగా నిషేధిస్తామని అక్కాచెల్లెమ్మలకు మాటిస్తున్నాను అని ఇచ్చిన హామీ నీటి బుడగలా మారిందని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రెంటాల కుమారి, యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మద్యపానాన్ని నిషేధించాలని కోరుతూ ఎన్ఎఫ్ఐడబ్ల్యూ, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో గుంటూరు భగత్ సింగ్ బొమ్మ సెంటర్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్యపాన నిషేధం ఇంకెప్పుడు! ప్రజల ప్రాణాలు పణంగా మద్యం వ్యాపారం చేయడం అవసరమా అని ప్రశ్నించారు. ప్రభుత్వ మద్యపాన దుకాణాలను పరిశీలిస్తే స్పిరిట్‌తో తయారుచేసిన మద్యాన్ని సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం 80 సంవత్సరాలు బతకాలనుకున్న ప్రజల ప్రాణాలు పాతిక సంవత్సరాలకే పోతున్నాయని అన్నారు. గతంలో రూ.30 ధర ఉండే బ్రాండ్లు ఇప్పుడు రూ.130, రూ.150, రూ.200లు దాకా పెరిగిందని, చిన్నాచితక పనులు చేసుకుంటున్న వారు అధిక ధరలకు మద్యాన్ని కొనలేక స్పిరిట్ తాగి మృత్యువాత పడిన సందర్భాలు ఉన్నాయని అన్నారు. ఇప్పటికైనా జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో పూర్తిగా మద్యపానాన్ని నిషేధించకపోతే తగిన గుణపాఠం తప్పదని, 2024 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపడానికి అన్ని విధాలుగా పోరాటాలను చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగర మహిళా సమాఖ్య కార్యదర్శి గుండెబోయిన లక్ష్మి, నగర సభ్యులు ఆర్.మాణిక్యం, అంకమ్మ, కోటేశ్వరి, హాతియా, పార్వతి, బసవ పున్నమ్మ, లింగమ్మ, విజయలక్ష్మి, యువజన సమాఖ్య నాయకులు మత్తే అరుణ్ కుమార్, వంగచెరి లక్ష్మీ దీపక్, పుదోట దేవరాజు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళా సమాఖ్య నాయకులు

వ్యాస రచన పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక బుర్రిపాలెం రోడ్డులో ఉన్న శ్రీచైతన్య కళాశాల నందు వీజీఆర్ డయాబెటిస్ వారు రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ కనబరిచారని ఆ కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీపతి పేర్కొన్నారు. మొదటి బహుమతి ముగ్గురు, రెండవ బహుమతి ఐదుగురు, తృతీయ బహుమతి ఏడుగురు, కన్సోలేషన్ బహుమతులను 17మంది విద్యార్థినీ, విద్యార్థులు గెలుపొందినట్లు చెప్పారు. ఈ మేరకు శుక్రవారం కళాశాల ఆవరణలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఏజీఎం నూతలపాటి అంజయ్య, ఆర్ఐ అప్పాజీ వ్యాసరచన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ, విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ప్రిన్సిపల్ లక్ష్మీపతి మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు వ్యాస రచన, సంగీత, సాహిత్య, నృత్య పోటీల్లో పాల్గొని మొదటి శ్రేణిలో విజయం సాధించినందుకు చాలా గర్వంగా ఉందన్నారు. విద్యార్థులు వివిధ పోటీ పరీక్షల్లో పాల్గొని విజయం సాధించడానికి శ్రీచైతన్య పాఠశాల టెక్నో కరిక్యులం, ఉపాధ్యాయుల కృషి, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం ఎంతో దోహదపడ్డాయని అన్నారు. ఈ అభినందన సభలో అకడమిక్ కో-ఆర్డినేటర్ గోపీచంద్, డీన్, ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

బీసీలను పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించాలని వినతి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగున్నర యేళ్ళు కావొస్తున్నా నేటి వరకు ఒక్క బీసీ న్యాయవాదిని కూడా పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించలేదని ఆంధ్రప్రదేశ్ బీసీ చైతన్య సమితి రాష్ట్ర అధ్యక్షులు బీసీ రమణ ఆరోపించారు. బీసీల సమస్యలు తెలుసుకునేందుకు రాష్ట్రవ్యాప్త పర్యటనలో భాగంగా బీసీ రమణ గుంటూరు జిల్లా కోర్టును సందర్శించారు. అక్కడ ఉన్న బీసీ న్యాయవాదులను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైసీపీ పాలనలో ఏ ఒక్క బీసీ న్యాయవాదిని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియమించనందుకు డీఆర్ఓ చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీసీ రమణ మాట్లాడుతూ జనాభాలో అధిక సంఖ్యాకులైన బీసీ న్యాయవాదులకు నామినేటెడ్ పదవులలో 50శాతం పబ్లిక్ ప్రాసిక్యూటర్ నియామకాలలో ప్రభుత్వ ఎందుకు నియమించలేదని ప్రశ్నించారు. డీఆర్ఓను కలిసిన వారిలో పలువురు బీసీ నాయకులు ఉన్నారు.

18వ రోజుకు అంగన్వాడీల సమ్మె

విశాలాంధ్ర, తెనాలి : అంగన్వాడీలు చేస్తున్న సమ్మె శుక్రవారం 18వ రోజుకు చేరుకుంది. వియస్ఆర్ అండ్ ఎన్‌వీఆర్ కళాశాల వద్ద నుండి తెనాలి మెయిన్ రోడ్డు, మున్సిపల్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికుల ధర్నా శిబిరం వద్దకు ప్రదర్శన చేరుకుంది. మున్సిపల్ కార్మికులకు అంగన్వాడీలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడి జిల్లా ప్రెసిడెంట్ కుమారి మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్ల పోరాటానికి తమ సంఘం యొక్క పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. వారి డిమాండ్లు సాధించేవరకు తాము కూడా సహకరిస్తామని అన్నారు. ఉభయసంఘాలు ఐక్యంగా ఉండి డిమాండ్ల కొరకు పోరాడతామన్నారు. విజయలక్ష్మి మాట్లాడుతూ సంఘాలు వేరైనా అందరూ కలిసి కట్టుగా ఉంటామని సిఐటియు సంఘాలన్నీకూడా ఈ పోరాటానికి మద్దతు ఇస్తాయని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. సిఐటియు నాయకులు షేక్ హుస్సేన్‌వలి, ప్రసాద్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటేశ్వర్లు, అంగన్వాడీ నాయకులు మాట్లాడారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : మున్సిపల్ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంటు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె నాలుగో రోజుకు చేరుకుంది. పారిశుధ్య కార్మికులు సమ్మె వలన పట్టణంలో పారిశుధ్య పనులు అటకెక్కాయి. తాడేపల్లి పట్టణం, రూరల్ గ్రామాల్లో ఉన్న కార్మికులు ఉదయం నుంచి సమ్మె చేసి పట్టణంలోని మున్సిపల్ జోనల్ కార్యాలయం వద్ద చేరుకుని ఉరితాడుతో పెద్దఎత్తున నిరసన తెలిపారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని, నీట సరఫరా, వీధి లైట్లు, యూజీడీ కార్మికులకు స్కిల్డ్, సెమి స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెకు సీపీఎం రూరల్ మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి పల్లె కృష్ణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి దొంతిరెడ్డి విజయ భాస్కర రెడ్డి తదితరులు మద్దతు తెలిపారు. ఈ సమ్మెకు కె.వెంగమ్మ, జి.కొండయ్య, ఎం.కామాక్షి, జె.రాంబాబు, వనమా షతీష్, నాని తదితరులు నాయకత్వం వహించారు.

క్రమబద్దీకరణ వేగవంతం చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక గుంటూరు మెడికల్ కళాశాల ఆవరణలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీ జీఈఎ)గుంటూరు జిల్లా కార్యాలయం నందు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్‌బాషా అధ్యక్షతన శుక్రవారం మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చాంద్‌బాషా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాంట్రాక్టు ఉద్యోగులందరి క్రమబద్దీకరణ పక్రియను ప్రభుత్వం వేగవంతం చేయాలని, వారికి నూతన పీఆర్‌సీ-2020 స్కేల్స్ వర్తింప చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను అమలు చేసి ఉద్యోగులలో ఆనందాన్ని, వారి కుటుంబ సభ్యుల్లో నూతన వెలుగులు నింపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ ఇచ్చి సుప్రీంకోర్టు జడ్జిమెంట్‌ను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. సంఘం జిల్లా కార్యదర్శి కెవిఎస్ శివారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కరీముల్లా షాఖాద్రి, జిల్లా ఉపాధ్యక్షులు రవికుమార్, నగరశాఖ ఉపాధ్యక్షులు రాధాకృష్ణ, ఓపిఎస్ సాధన సమితి డిప్యూటీ కో-ఆర్డినేటర్ నాగరాజు పాల్గొన్నారు.

లైఫ్ సర్టిఫికెట్ల సమర్పణ

విశాలాంధ్ర, తెనాలి : రాష్ట్ర పెన్షనర్స్ జీవిత ధృవీకరణ పత్రాలను 2024వ సంవత్సరం జనవరి 1వ తేదీ నుండి ఫిబ్రవరి 29వ తేదీ వరకు లైఫ్ సర్టిఫికెట్లను సమర్పించాలని తెనాలి పెన్షనర్స్ సంఘం అధ్యక్షులు యం.రామకృష్ణమూర్తి తెలిపారు. తెనాలిలో డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్లను యస్.టి.ఓ. కార్యాలయం, పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయం లేదా సౌకర్యం అందుబాటులో ఉన్న ఏదైనా నెట్‌వర్క్ కేంద్రాలలో సమర్పించవచ్చని చెప్పారు. పెన్షనర్స్ కార్యాలయంలో అన్ని వేళలా అందుబాటులో ఉంటామని తెలిపారు.

ఏర్పాట్లు పరిశీలించిన వైసీపీ నేతలు

విశాలాంధ్ర-తాడికొండ : నియోజకవర్గ కేంద్రమైన తాడికొండలో వైసీపీ ఆధ్వర్యంలో శనివారం జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్ర ఏర్పాట్లను శుక్రవారం ప్రత్తిపాడు శాసనసభ్యులు, నియోజకవర్గ ఇన్ చార్జ్ మేకతోటి సుచరిత, ఎంపీ అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, నియోజకవర్గ పరిశీలకులు బత్తుల బ్రహ్మారెడ్డి, మేకతోటి దయాసాగర్ పరిశీలించారు. అడ్డరోడ్డు నుంచి తాడికొండ వరకు ర్యాలీ జరుగుతున్న నేపథ్యంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. అలాగే మూడు గంటలకు అడ్డరోడ్డు నుంచి తాడికొండ బస్టాండ్ వరకు ర్యాలీ ఉంటుందన్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. అలాగే నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో డ్వాక్రా మహిళలు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యే విధంగా ప్రణాళికను సిద్ధం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆనంద్ నియామకం

విశాలాంధ్ర-మంగళగిరి: బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్ చేతుల మీదగా బీసీ సంక్షేమ సంఘం దుగ్గిరాల మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఉప్పాల ఆనంద్ బాబు నియామక పత్రాన్ని అందుకున్నారు. బీసీ సంక్షేమ సంఘాన్ని విస్తృతంగా బలోపేతం చేసే దిశగా కమిటీలు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ కాగితాల స్వాతి గౌడ్, దుగ్గిరాల మండలం మహిళా అధ్యక్షురాలు మాది నాగ దుర్గ, ఆలా శివాజీ, ధనుంజయ్, ఉయ్యూరు రాజేశ్వరి, జై లక్ష్మీ, మాది వెంకటేశ్వరరావు, దానబోయిన సునీత తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యునిగా గంగాధర్

విశాలాంధ్ర-పొన్నూరు: ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ జిల్లా సభ్యునిగా పొన్నూరు పట్టణా నికి చెందిన గూడవల్లి గంగాధర్ ఎన్నికయ్యారు. తెనాలి సబ్ కలెక్టర్ నేతృత్వంలో ఈ నెల 30న తెనాలి సబ్ కలెక్టర్ కార్యాలయం నందు అభినందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గంగాధర్ తెలిపారు. సభ్యులుగా ఎన్నికైన మరో ముగ్గురిని గంగాధర్‌తో పాటు అభినందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన గూడవల్లి గంగాధర్ మాట్లాడుతూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీల హక్కుల కోసం తన వంతు పోరాటం సాగిస్తానన్నారు. ఎస్సీ ఎస్టీలకు న్యాయం జరిగే విధంగా తాను కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.

కౌన్సిల్ సమావేశంలో గందరగోళం

విశాలాంధ్ర, తెనాలి : మున్సిపల్ కార్యాలయ సమావేశపు హాలులో శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికారమేష్ అధ్యక్షత వహించారు. వైఎస్సార్ సిపి కౌన్సిలర్లు, టిడిపి కౌన్సిలర్ల మధ్య వాగ్వివాదం జరిగింది. గందరగోళంగా మాడంతో చైర్‌పర్సన్ సమావేశాన్ని కొంత సమయం వాయిదా వేశారు. సమావేశం ప్రారంభంకాగానే అజెండాలో 11వ అంశంలో టిడిపి కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నలకు వాగ్వివాదాలు జరిగాయి. ఈ గందరగోళాల అనంతరం చైర్‌పర్సన్ అజెండాను ప్రవేశపెట్టించారు. అప్పుడు కూడా టిడిపి కౌన్సిలర్లు ఉద్యోగిపైన ఆగ్రహం వ్యక్తం చేశారు. బడ్జెట్‌ను చదివి వినిపించారు. దానిని సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. కౌన్సిల్ సమావేశంలో ఏర్పాటు చేసిన అంశాలను కూడా ఏకగ్రీవంగా సభ ఆమోదించింది. సమావేశంలో వైస్‌చైర్‌పర్సన్ అత్తోట నాగవేణి, కమిషనర్ యం.జశ్వంతరావు, నాగమల్లేశ్వరరావు, వివిధ భాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

షేక్ షబీనాకు అభినందనలు

విశాలాంధ్ర, తెనాలి : పవర్ లిఫ్టింగ్ గోల్డ్‌మెడల్ విన్నర్ షేక్ షబీనాకు పలువురు పెద్దలు అభినందనలు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి సబ్ జూనియర్ విభాగంలో 84 కేజీలు కేటగిరిలో స్వర్ణపతకం సాధించింది. ఈ సందర్భంగా ఆమను సౌత్‌ఇండియన్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి సకల కోటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు యం.ప్రభాకర్, కార్యదర్శి సకల సూర్యనారాయణ, గౌరవాధ్యక్షులు వెంకటేశ్వరారవు, కొమ్మాకుల విజయభాస్కర్, కోచ్ అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ షేక్ సంధాని, సీనియర్ పవర్ లిఫ్టర్ బి.ప్రసాద్, గుమ్మడి వెంకటేశ్వరరావు తదితరులు షబీనాను అభినందించారు.

ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-గుంటూరు : ఏపీ ఎన్జీవో అసోసియేషన్ 2024 టేబుల్ క్యాలెండర్‌ను గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు, కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్, ఉపాధ్యక్షులు ఎస్.రాజశేఖర్, కోశాధికారి ఎల్.శ్రీధర్ రెడ్డి, సంయుక్త కార్యదర్శి కూరాకుల శ్రీనివాసరావు, మహిళా సంయుక్త కార్యదర్శి కె.శివజ్యోతి, నగర శాఖ అధ్యక్షులు ఎస్‌పీఎస్ సూరి, కార్యదర్శి సిహెచ్ కళ్యాణ్ కుమార్, సహ అధ్యక్షులు బి.సునీల్ కుమార్, సంయుక్త కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, మహిళా విభాగము చైర్‌పర్సన్ రాధా రాణి తదితరులు పాల్గొన్నారు.

శృంగారపురంలో బెల్లం తయారీ

విశాలాంధ్ర-దుగ్గిరాల : సంక్రాంతి పండుగ వచ్చిందంటే బెల్లానికి గిరాకీ ఎక్కువ. అటువంటి బెల్లానికి కేరాఫ్ అడ్రస్ దుగ్గిరాల మండలం పరిధిలోని శృంగారపురం. గత 77 సంవత్సరాలుగా ఆ గ్రామ పొలిమేరలో బెల్లం కసర్లను నిర్వహిస్తున్నారు. 9 నెలల పంటైన స్వచ్ఛమైన చెరుకుతో ఎటువంటి మందులను ఉపయోగించకుండా, మొక్క తోట నుంచి సాగుచేసిన ఆర్గానిక్ బెల్లాన్ని తయారు చేస్తున్నారు. ఈ నెలలో శృంగారపురం వెళ్ళామంటే బెల్లం సువాసన వెదజల్లుతుందని చెప్పొచ్చు. సంక్రాంతి పండుగ నెల రోజులు ముందే ఈ కసర్లలను ఏర్పాటు చేసి, ప్రతిరోజు 30 మంది కూలీలతో 150 కేజీలు వండుతున్నారు. గతంలో గ్రామంలో 30 బెల్లం కసర్లు ఉండేవని, బెల్లంలో గిట్టుబాటు ధర రాకపోవడంతో మూడు కసర్లకే పరిమితమైందని రైతులు అంటున్నారు. ప్రస్తుతం రోజుకి ఆరు కళాయిల్లో 25 బుట్టలు తయారు కాగా, 33 కేజీల బుట్ట రూ.3 వేలకు విక్రయించడం జరుగుతుందన్నారు. కేజీ రూ.90 నుంచి రూ.95లు ధర నిర్ణయించి విజయవాడ, తెనాలి, గుంటూరు, మంగళగిరి పరిసర గ్రామ ప్రజలకు పండగ సీజన్లో పిండివంటలు వండుకునేందుకు నాణ్యమైన బెల్లంతో పాటుగా, వినియోగదారులకు సరసమైన ధరకు అమ్మటం జరుగుతుందని రైతు పెందుర్తి రవికాంత్ తెలిపారు. బయట మార్కెట్ కంటే ఎక్కువగా వినియోగదారులే తమ వద్దకు వచ్చి బెల్లాన్ని కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. గతంలో ఆ గ్రామం 16 ఎకరాల్లో చెరుకు పంటను సాగు చేసారు. నేడు దిగుబడి గిట్టుబాటు ధర లేకపోవడంతో 30 ఎకరాలలో సాగు అవుతుందని రైతులు చెబుతున్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

దేశంలో సగరులను ఒకే పేరుతో పిలవాలి

విశాలాంధ్ర-మంగళగిరి : భారత దేశంలో వివిధ పేర్లతో పిలవబడు తున్న సగరులను సంఘటితం చేసి, సగర భగీరథ అనే ఒకే పేరుతో పిలవాలని కోరుతూ ఢిల్లీలో ఫిబ్రవరి 29వ తేదీన శ్రీ సగర భగీరథ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగే సగరుల బహిరంగ సభను జయప్రదం చేయాలని చేపట్టిన భగీరథ జన్ కళ్యాణ్ బస్సు యాత్ర శుక్రవారం మంగళగిరి గంగా భగీరథ సగర కమ్యూనిటీ హాల్ వద్దకు చేరుకుంది. అనంతరం కమ్యూనిటీ హాల్లో జరిగిన మీడియా సమావేశంలో ట్రస్ట్ నేషనల్ కోఆర్డినేటర్ హరీష్ చౌహాన్ మాట్లాడారు. దేశంలో సుమారు 20 కోట్ల మంది ఉన్న సగరులు ఆర్థికంగా, రాజకీయంగా వెనకబడిపోయారన్నారు. దేశంలోని సగరులను ఒక తాటిపైకి తెచ్చేందుకు సెప్టెంబర్ 27న ఢిల్లీలో బస్సు యాత్ర ప్రారంభించి, అన్ని రాష్ట్రాలలో యాత్ర నిర్వహిస్తున్నామన్నారు. దేశం లోని సగరులు ఢిల్లీలో జరిగే బహిరంగ సభకు భారీగా తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. గంగా భగీరథ సగర సంఘం అధ్యక్షులు పందేటి సాంబశివ రావు, జూట్రు ఏడుకొండలు, కర్నాటి శివ సత్యనారాయణ, ధూపాటి రామకోటే శ్వరరావు, కలవకొల్లు వెంకయ్య, కటారి విష్ణుమూర్తి, గండికోట అచ్చయ్య, నంగళం ప్రసాద్, కగ్గా శ్రీనివాసరావు, గండికోట హేమ కుమార్ పాల్గొన్నారు.

హామీలపై మభ్యపెడుతున్న వైసీపీ నేతలు

విశాలాంధ్ర-గుంటూరు : 2019 ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన వైసీపీ, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99.5 శాతం పూర్తి చేశామని ఊకదంపుడు ఉపన్యాసాలతో ప్రజలను మభ్యపెడుతున్నారని తెలుగుదేశం పార్టీ గుంటూరు నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్ ఆరోపించారు. శుక్రవారం అర్బన్ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. మూడు నెలలు ఆగితే తెలుగుదేశం, జనసేన సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. జగన్ రెడ్డి మాటల మనిషే గానీ, చేతల మనిషి కాదని అన్నారు. ఒక్క ఛాన్స్ అని రాష్ట్రాన్ని జగన్ రెడ్డి నాశనం చేశాడన్నారు. మళ్లీ పొరపాటున జగన్ వస్తే రాష్ట్ర ప్రజలకు గంజాయి తినిపిస్తాడన్నారు. మద్యాన్ని నిషేధించాకే వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడుగుతానన్న జగన్ రెడ్డి, కల్తీ మద్యం ఏరులైపారిస్తూ మద్యం అమ్మకాల ఆదాయం తాకట్టుపెట్టి రూ.25 వేల కోట్లు అప్పు తెచ్చాడన్నారు. ఆడుదాం ఆంధ్రా అంటూ డబ్బులు దండుకుంటున్నాడని, ఈ కొత్త స్కామ్‌ను ప్రజలు గ్రహించాలని అన్నారు. అధికారంలోకి రాగానే రూ.3 వేల పింఛన్ అని చెప్పి, చివరి మూడు నెలలు రూ.3 వేలు ఇవ్వడం మోసం కాదా అని ప్రశ్నించారు. ప్రతిఒక్కరూ జగన్ రెడ్డి మోసకారితనాన్ని తెలుసుకోవాలన్నారు.

డాక్టర్ కార్తీక్‌కు హియోషి యంగ్ లీఫ్ అవార్డు

విశాలాంధ్ర-మంగళగిరి : ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఎన్విరాన్మెంట్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ కార్తీక్ రాజేంద్రన్‌కు హియోషి గ్రూప్ ఏటా శాస్త్రవేత్తలకు అందించే ప్రతిష్టాత్మక యంగ్ లీఫ్ అవార్డు లభించింది. పర్యావరణ సంబంధ పరిశోధనల్లో విశేషమైన సేవలు అందిస్తున్నందుకు గాను 2023 సంవత్సరానికి డాక్టర్ కార్తీకన్‌ను ఎంపిక చేసి హియోషి కంపెనీ అవార్డును ప్రకటించింది. గురువారం మధ్యాహ్నం డాక్టర్ కార్తీక్ అవార్డును అందుకున్నారు. డాక్టర్ కార్తీక్ రాజేంద్రన్ గడచిన నాలుగేళ్లుగా ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో పర్యావరణ శాస్త్ర విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. బోధన, రీసెర్చ్ రంగాల్లో డాక్టర్ కార్తీక్ ఇప్పటికే పలు ప్రతిష్టాత్మక అవార్డులను అందుకున్నారు. ఇటీవలనే ఆయనకు యంగ్ సైంటిస్ట్ అవార్డు కూడా లభించింది. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య మనోజ్ అరోరా శుక్రవారం డాక్టర్ కార్తీక్‌ను అభినందించారు.

పేద విద్యార్థులకు వరం 'జగనన్న విద్యాదీవెన'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : నిరుపేద విద్యార్థులకు గొప్ప వరం జగనన్న విద్యా దీవెన అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు వినోద్, రీజనల్ కో-ఆర్డినేటర్ విఠల్ పేర్కొన్నారు. జూలై-సెప్టెంబర్ 2023 త్రైమాసికానికి సంబంధించి 8,09,039 లక్షల మంది విద్యార్థులకు రూ.584 కోట్ల రూపాయల లబ్ధిని చేకూరుస్తూ పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో బటన్ నొక్కి విద్యార్థులు, తల్లుల జాయింట్ ఖాతాల్లో జమ చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు గుంటూరు విద్యార్థి లోకం మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. వినోద్, విఠల్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఏసీ కళాశాల ఆవరణలో జరిగిన ఒక కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వినోద్, విఠల్ మాట్లాడుతూ, పేద విద్యార్థులు కూడా పెద్ద చదువులు చదవాలన్న సమున్నత లక్ష్యంతోనే జగనన్న విద్యా దీవెన పథకానికి సీఎం శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఈ పథకం కింద ఐటీఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే విద్యార్థులు తమ కాలేజీలకు చెల్లించాల్సిన పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వమే చెల్లిస్తుందని వివరించారు. జిల్లా విద్యార్థి విభాగం నేతలు రవి, భాను, విశాల్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రావినూతలకు శ్రద్ధాంజలి

విశాలాంధ్ర, తెనాలి : నటునిగా, దర్శకునిగా, సాహితీవేత్తగా జీవితాంతం కృషి చేసిన మహోన్నతులు రావినూతల శ్రీరామమూర్తి ప్రజల హృదయాలలో చిరస్మరణీయులని తెనాలి పట్టణ రంగస్థల కళాకారుల సంఘం ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు శ్రద్ధాంజలి ఘటించారు. తెనాలి బిసి కాలనీలో రంగస్థల కళాకారుల సంఘం సమావేశ హాలులో శుక్రవారం రంగస్థల కళాకారుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కీ.శే.రావినూతల శ్రీరామమూర్తి సంస్మరణ సభకు అధ్యక్షత వహించి మాట్లాడారు. చిన్నతనం నుండి రచన, నాటక కళలపై ఆకర్షితుడై ఆ కళారంగం వున్నతికి కృషి చేశారన్నారు. సినీ రంగంలో డైరెక్టర్ కె.విశ్వనాథ్ వద్ద సహాయకునిగా పనిచేశారని, ఉద్యోగం చేస్తూ నాటక కళాపరిషత్‌లలో ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. నవ్యాంధ్ర, తొలి ఉగాది సాహిత్య పురస్కారాన్ని రాష్ట్రంలో నాటక ప్రదర్శనలిస్తూ ఎన్నో పురస్కారాలు పొందారని ఆయన స్ఫూర్తితో నాటకరంగ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. 50 సంవత్సరాలుగా ఉన్న అభ్యుదయ కళాసమితి తెనాలి సంస్థ అధ్యక్షునిగా పది సంవత్సరాలు పనిచేశారన్నారు. సంస్థ ద్వారా ఎందరో నటీనటులను తయారు చేసిన ఘనత ఆయనకు దక్కుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గుంటూరు జిల్లా అధ్యక్షులు బొల్లిముంత కృష్ణ మాట్లాడుతూ మహోన్నత కవి గురజాడ అడుగుజాడలో ఆయన రాసిన కన్యాశుల్కం నాటకం ప్రదర్శించారన్నారు. ఆయన దర్శకత్వంలోనే నాటికలు రాష్ట్రరాష్ట్రేతరంగా ప్రదర్శించారని ఆయన లేని లోటు తీరనిదన్నారు. సభలో సహజకవి ఐనాల మల్లేశ్వర రావు, గోపాలకృష్ణమూర్తి, ఆర్ అండ్ బి రాజు, కన్నెగంటి మధు సురేష్‌బాబు, సీతారామయ్య ప్రభృతులు పాల్గొన్నారు. సభా ప్రారంభంలో శ్రీరామమూర్తి చిత్రపటానికి కళాకారులు సాహితీపరులు అభిమానులు పూలతో శ్రద్ధాంజలి ఘటించారు.

CHANGE OF NAME and DATE Of BIRTH

I, **Sub BHARAT BHUSHAN** service No JC -523685Y 8 DOGRA C/O 56 APO That in my service Records my mother name and date of Birth was wrongly mentioned as **BASHNO DEVI 07-May 1954** may be corrected as **VAISHNO DEVI, 07- March 1955** and it may be entered in my service Records accordingly.

విశాలాంధ్ర
పల్నాడు జిల్లా

విశాలాంధ్ర క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-దుర్గి : విశాలాంధ్ర 2024 సంవత్సరం క్యాలెండర్‌ను తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ జి.రమేష్ కుమార్, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ యేచూరి సునీత సాయి శంకర్, ఎంపీడీఓ కె.సమతావాణి శుక్రవారం ఆవిష్కరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ ప్రకృతి అందాలను ప్రతిబింబించేలా క్యాలెండర్‌ను మల్టీకలర్‌తో అందంగా తయారు చేసిన విశాలాంధ్ర యాజమాన్యానికి, సంస్థ పాత్రికేయులకు, విశాలాంధ్ర పాఠకులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ చినవెంకటేశ్వర్లు, ఏఓ శివప్రసాద్, ఈవోపీఆర్డీ జీఎల్ఎన్ గుప్తా, పుల్లయ్య, గ్రామ రెవిన్యూ అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఘన విజయంపై హర్షం

విశాలాంధ్ర-సత్తెనపల్లి : హోరాహోరీగా జరిగిన సింగరేణి కార్మికుల గుర్తింపు సంఘం ఎన్నికల్లో అధికార పార్టీ కాంగ్రెస్ అనుబంధ సంఘం ఐఎన్‌టీయూసీపై ఏఐటీయూసీ ఘనవిజయం సాధించడం పట్ల ఏఐటీయూసీ సత్తెనపల్లి నియోజకవర్గ గౌరవాధ్యక్షులు నరిశేటి వేణుగోపాల్, ఏఐటీయూసీ సత్తెనపల్లి నియోజకవర్గ అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పి.ఇర్మీయా, ఏఐటీయూసీ సత్తెనపల్లి పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు డీఆర్ మస్తాన్, ఇ.అంజిరెడ్డి తదితరులు హర్షం వ్యక్తంచేశారు.

ప్రభుత్వ మొండివైఖరితో విద్య దూరం

విశాలాంధ్ర- కారంపూడి: అంగన్‌వాడి వర్కర్లు, హెల్పర్ల పట్ల ప్రభుత్వం అవలంభిస్తున్న మొండి వైఖరితో అంగన్‌వాడి విద్యార్థులకు విద్యను దూరం చేస్తుంది. అంగన్‌వాడీలు 18 రోజులుగా తమ సమస్యలను పరిష్కరించమంటూ రోడ్డుపై వివిధ రూపాలలో నిరసన, ధర్నాలను చేస్తున్నారు. అంగన్‌వాడీల బాధను పక్కనపెట్టిన ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచేందుకు ఇందిరక్రాంతిపథం సీసీలకు, యానిమేటర్లకు, సచివాలయ సిబ్బందికి అదనపు బాధ్యతలను అప్పగించింది. వీరంతా అదనపు బాధ్యతలను ప్రక్కన పెట్టడంతో విద్యార్థులకు చదువు అటకెక్కింది. అదనపు బాధ్యతలు స్వీకరించిన వారంతా విధులు దుమ్మా కొట్టిన వీరిపై పర్యవేక్షణ చేయవలసిన అధికారులు మిన్నకుండిపోవడంతో అంగన్‌వాడి కేంద్రాలన్నీ మూతపడ్డాయి. అంగన్‌వాడీల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి చిన్నారులకు విద్యను అందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

అంగన్వాడీల ధర్నాకు ఐహెచ్ఆర్ఏ సంఘీభావం

విశాలాంధ్ర-వినుకొండ: అంగన్వాడిలు చేస్తున్న ధర్నాకు ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ కరణం తిరుపతి నాయుడు శుక్రవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారి న్యాయమైన డిమాండ్లు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేటి వరకు ఒక్క అధికారి వారికి మద్దతు తెలుపకపోవడం, వారిపై దుర్భాషగా మాట్లాడుట సరైన పద్ధతి కాదని ఐహెచ్ఆర్ఏ తరపున ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి అంగన్వాడీల న్యాయమైన సమస్యలను తక్షణమే తీర్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఐహెచ్ఆర్ఏ ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ జిల్లా జనరల్ సెక్రెటరీ కిన్నెర కోటయ్య పాల్గొన్నారు.

వ్యూహం సినిమా నిలిపివేయాలి

విశాలాంధ్ర-వినుకొండ: టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, లోకేష్, పవన్ కళ్యాణ్ మీద రాంగోపాల్ వర్మ అసభ్యకర రీతిలో తీసిన వ్యూహం సినిమాను వెంటనే నిలుపుదల చేయాలని శుక్రవారం వినుకొండ పట్టణంలో టి.ఎన్.ఎస్.ఎఫ్, తెలుగు యువత ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. రాంగోపాల్ వర్మ చిత్రపటాన్ని చెప్పులతో కొట్టి దగ్ధం చేశారు. ఈ కార్యక్రమంలో వినుకొండ నియోజకవర్గం టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు నర్ర కిషోర్, వినుకొండ నియోజకవర్గం మాజీ డిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షుడు కన్నెదరి బ్రహ్మం, టౌన్ తెలుగు యువత అధ్యక్షుడు తోమాటి కాశీం, పల్నాడు జిల్లా టిఎన్ఎస్ ఎఫ్ అధికార ప్రతినిధి వీరగంధం ప్రశాంత్, నియోజవర్గ కార్యదర్శి కాకాని బ్రహ్మనాయుడు, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి షేక్ అబ్దుల్ భాష, ఎస్.కె.ఖాజావలి, కరీంమ్, వినుకొండ మండల కార్యదర్శి మాదినేని లక్ష్మణ్, నాగేంద్రబాబు, రాయపూడి కోటి, దొడ్డ బ్రహ్మం, గోపాల్, మరియబాబు, తెలుగు యువత నాయకులు కడియం మరియబాబు, కురిచేటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అంగన్వాడిల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-వినుకొండ: రాష్ట్ర ప్రభుత్వం గత 18 రోజులుగా సమ్మెలో ఉన్న అంగన్వాడీల సమస్యలపై వెంటనే చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కోలా స్వాతి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నాడు వినుకొండ పట్టణంలోని సురేష్ మహల్ రోడ్ లో గత 18 రోజులుగా దీక్షలు నిర్వహిస్తున్న అంగన్వాడి దీక్షా శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు తెలియజేసి ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికలప్పుడు అంగన్వాడీలకు అనేక హామీలు ఇస్తూ తెలంగాణ రాష్ట్రాన్ని మించిన వేతనాలు ఇస్తానని అధికారంలోకి వచ్చి నాలుగు సంవత్సరాల తొమ్మిది నెలలు దాటి మరొక మూడు మాసాల్లో ఎన్నికలు వస్తున్నప్పటికీ ఇంతవరకు అమలు చేయలేదని 62 సంవత్సరాలు రిటైర్మెంట్ వయస్సు నిర్ణయించాలని, రిటైరైన అంగనవాడి వర్కర్‌కు టీచర్‌కు ఐదు లక్షల రూపాయలు బెనిఫిట్ ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలని, అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు. 18వ రోజు దీక్షలకు మద్దతు తెలియజేసిన వారిలో సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, ఏఐటీయూసీ వినుకొండ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఉలవలపూడి రాము, వ్యవసాయ కార్మిక సంఘం పిన్నిబోయిన వెంకటేశ్వర్లు,మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు నాగమణి, బూదాల చైతన్య, ఎ. కాశి లక్ష్మి, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : మున్సిపల్ కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంటు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె నాలుగో రోజుకు చేరుకుంది. పారిశుధ్య కార్మికులు సమ్మె వలన పట్టణంలో పారిశుధ్య పనులు అటకెక్కాయి. తాడేపల్లి పట్టణం, రూరల్ గ్రామాల్లో ఉన్న కార్మికులు ఉదయం నుంచి సమ్మె చేసి పట్టణంలోని మున్సిపల్ జోనల్ కార్యాలయం వద్ద చేరుకుని ఉరితాడుతో పెద్దఎత్తున నిరసన తెలిపారు. ఈ సమ్మెకు సీపీఎం రూరల్ మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి పల్లె కృష్ణ, దొంతిరెడ్డి విజయ భాస్కర రెడ్డి తదితరులు మద్దతు తెలిపారు.

సర్పంచుల నిధులు స్వాహా చేసిన జగన్: జీవీ

విశాలాంధ్ర-వినుకొండ: ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సర్పంచుల నిధులు కూడా స్వాహా చేసి పెద్ద గజదొంగగా మారాడని టిడిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఘాటుగా విమర్శించారు. స్థానిక అవ్వారు కళ్యాణ మండపంలో శుక్రవారం సర్పంచుల సంఘం సమావేశ అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం జగన్మోహన్ రెడ్డి 14,15 వ ఆర్థిక సంఘం నిధులు 7 వేల 560 కోట్లు నిధులు స్వాహా చేశారన్నారు. సర్పంచులు తమ నిధుల్లో 10 శాతం మాత్రమే విద్యుత్‌కు చెల్లించాల్సి ఉండగా విద్యుత్ బిల్లు అంటూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం పంపిన నిధులను స్వాహా చేసిందన్నారు. జగన్మోహన్ రెడ్డి గాంధీ స్వరాజ్యం అంటూ గాంభీరాలు పలికి సర్పంచ్‌ల నిధులను దారి మళ్లించి వారిని రోడ్డున పడేసారన్నారు. ఇక గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు 36 వేల కోట్లు కూడా జగన్ ప్రభుత్వం దోచుకు తిన్నదన్నారు. చేసిన వర్కులకు బిల్లు రాక నియోజకవర్గంలోని అగ్నిగుండాల గ్రామానికి చెందిన బీసీ కులస్తుడు దాసి సుబ్బారావు మృతి చెందాడని జీవి అన్నారు. టిడిపి ప్రభుత్వం రాగానే సర్పంచులు చేసిన పనులన్నింటికీ బిల్లులు ఇస్తామన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు కల్లూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ. జగన్ రెడ్డి దోపిడీ వల్ల 12 వేల ఆరు వందల 70 గ్రామాలు అభివృద్ధి కుంటుపడిందన్నారు. వాలంటీర్ల వ్యవస్థను తెచ్చి సర్పంచులను. ఎంపీటీసీలను పనికిరాని వాళ్ళుగా చేశారన్నారు. జగన్ రెడ్డి పిచ్చి చేష్టల వల్ల మూడు కోట్ల 70 లక్షల మంది ప్రజలు పలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సమస్యలపై ఈ నెల మూడో తేదీన విజయవాడలో రాష్ట్రవ్యాప్త అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి టిడిపి అధినేత చంద్రబాబును, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను ఆహ్వానించి తమ సమస్యలపై చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి నేతలు లగడపాటి వెంకట్రావు, గుంటూరు సాంబశివరావు, సర్పంచుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించే వరకు పోరు

విశాలాంధ్ర-పెదకూరపాడు : అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించేంతవరకు పోరాటం ఆగదని పెదకూరపాడు నియోజకవర్గ ఏఐటీయూసీ, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు మునగోటి శ్రీనివాసరావు, కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా యువజన సంఘం అధ్యక్షులు గంటా గోపి, మండల జనసేన అధ్యక్షులు మల్లెల చలపతిరావు హెచ్చరించారు. నియోజవర్గ కేంద్రమైన పెదకూరపాడులో తహశీల్దార్ కార్యాలయం వద్ద 18వ రోజు సమ్మెలో పాల్గొని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ కలిసి వినూత్న రీతిలో మోకాళ్లపై నిలబడి గాలిపటాలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం శ్రీనివాసరావు మాట్లాడుతూ హామీలు అమలు చేయమని కోరుతుంటే సీఎం కనీసం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. పైగా ఉద్యమాన్ని అణచివేయాలని చూడడం జగన్ నియంతృత్వ విధానానికి పరాకాష్ట అన్నారు. ఇకనైనా జగన్‌మోహన్ రెడ్డి స్పందించి అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో మహిళల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. పల్నాడు జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గంటా గోపి మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలపై స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి మాట్లాడిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరంగా ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ హెల్పర్స్ యూనియన్ నాయకులు కొల్లి లక్ష్మీనరసింహ సామ్రాజ్యం, జ్యోతి రాణి, స్రవంతి, జనసేన, కాంగ్రెస్ నేతలు హనుమంతరావు, శౌరీలు, హనుమత్ శ్రీనివాసరావు, వెంకట్, నాగేశ్వరరావు, ఇబ్రహీం, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం పనుల పరిశీలన

విశాలాంధ్ర-పెదకూరపాడు : సామాజిక ఆరోగ్యకేంద్రం నిర్మాణ పనులను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పరిశీలించారు. రూ.8.65 కోట్లతో నిర్మిస్తున్న ఆరోగ్యకేంద్రంలో పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పన, మిగిలిన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం పాడిపల్లె నుంచి పెదకూరపాడు వరకు ఏఎంసీ నిధుల నుంచి రూ.60 లక్షలతో తారురోడ్డు నిర్మాణం పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టుదారులకు సూచనలు సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ఈద సాంబిరెడ్డి రెడ్డి, ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, వైసీపీ నాయకులు భాష, ఎన్.యోహాను తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే పిన్నెల్లి

విశాలాంధ్ర-విజయపురిసౌత్: స్థానిక దేశవరపు క్యాంపు తండాలో నూతనంగా నిర్మించిన శ్రీ మాతా జగదాంబ, సేవాలాల్ మహారాజ్, అభయాంజనేయ స్వామి ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గిరిజనుల ఆరాధ్య దైవమైన శ్రీ మాతా జగదాంబ, సేవాలాల్ మహారాజ్ ఆలయాన్ని 25 లక్షలతో నిర్మించడం ఆనందంగా ఉందన్నారు. గిరిజన తండాల్లో అన్ని సౌకర్యాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సీఎం జగన్మోహన్ రెడ్డి పేదల అభ్యున్నతి కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశవరపు క్యాంపు తండాలో వీధి దీపాలు, తాగునీటి సమస్యపై స్థానికులు తనకు వివరించారని, సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మండలి కమిటీ సభ్యుడు శేరెడ్డి గోపిరెడ్డి, రిటర్డ్ డిఈ నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, మత్యకారుల సంఘం అధ్యక్షుడు కారే ముసలయ్య, శ్రీనివాసరావు, హాతీరామ్ నాయక్, దూప్ సింగ్, సంతవరపు లక్ష్మీ నారాయణ, మస్తాన్ పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ప్రారంభం

విశాలాంధ్ర-మాచర్ల: మానసిక ఉల్లాసంతో పాటు యువతకు ఉపాధి కల్పనలో క్రీడలు దోహదపడతాయని వైయస్సార్సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట రామిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వీపీ సౌత్, నాగులవరం, చింతలతండా గ్రామ సచివాలయాల పరిధిలో ఏర్పాటుచేసిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు యువతలో స్ఫూర్తిని నింపుతాయన్నారు. క్రీడలలో రాణించిన యువతకు సీఎం జగన్ రానున్న రోజుల్లో మంచి ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తున్నారన్నారు. సీఎం జగన్ పాలనలో రాష్ట్రం అన్ని రకాలుగా అభివృద్ధి చెందిందని, రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసేందుకు కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం క్రీడాకారులకు క్రికెట్ కిట్స్, వాలీ బాల్స్, షటిల్ బ్యాట్‌లను అందజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ అధికారి గబ్రు నాయక్, ఎంపీడీవో సరోజినీ దేవి, పంచాయతీ సెక్రెటరీ దస్తగిరి తదితర నాయకులు పాల్గొన్నారు.

పట్టణంలో విజిబుల్ పోలీస్ కార్యక్రమం

విశాలాంధ్ర-మాచర్ల: యువత మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పట్టణ సీఐ శరత్ బాబు కోరారు. విజిబుల్ పోలీస్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన తన సిబ్బందితో పట్టణంలోని రైల్వే స్టేషన్ ప్రాంగణంలో యువతకు కౌన్సిలింగ్ ఇచ్చారు. యువత నిషేధిత సారా, జూదం, గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. చెడు వ్యసనాలకు బానిస కాకుండా విద్యపై మక్కువ చూపించి ఉజ్వల భవిష్యత్తు కోసం కృషి చేయాలని ఆయన కోరారు.

హామీలు అమలుచేయని ప్రభుత్వం : జీవీ

విశాలాంధ్ర-వినుకొండ: జగన్మోహన్ రెడ్డి మేనిఫెస్టోలో చూపిన హామీల్లో పది శాతం కూడా అమలు చేయలేదని టిడిపి జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నాలుగేళ్లుగా మూడు రాజధానులు అంటూ నేటికీ ఒక రాజధాని కూడా లేకుండా చేశాడని మండిపడ్డారు. ఎన్నికల ముందు మద్య నిషేధం అమలు చేస్తామని హామీలు ఇచ్చి ఎన్నికల అనంతరం తమ బంధువులతో మద్యం కంపెనీలు పెట్టించి దోచుకు తింటున్నారని అన్నారు. అలాగే రానున్న 15 ఏళ్ల వరకు మద్యం ఆదాయంపై రుణం కూడా తీసుకురావటం సిగ్గుచేటు అన్నారు. ఇసుక దోపిడీ, సీపీఎస్ రద్దు చేస్తానంటూ ఉద్యోగులను మోసం చేసి యువతకు జాబ్ క్యాలెండర్ లేకుండా చేశాడన్నారు. అంగన్వాడీలు రాష్ట్రవ్యాప్తంగా తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ ఆందోళన చేస్తుంటే. ప్రభుత్వం ఏ విషయం చెప్పకుండా వారిని రోడ్డున పడవేసిందని అన్నారు.

ప్రతిభకు ప్రోత్సాహం... నైపుణ్యాలకు మెరుగులు

విశాలాంధ్ర-సత్తెనపల్లి రూరల్ : యువకులలో ఉన్న ప్రతిభను ప్రోత్సహించి, నైపుణ్యాలను మెరుగుపరిచి రాష్ట్ర జాతీయ స్థాయి క్రీడాకారులుగా వారిని తీర్చిదిద్దడమే లక్ష్యంగా సాగుతున్న ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా విశేష స్పందన లభిస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరుగుతున్న క్రికెట్ పోటీలను శుక్రవారం ప్రారంభించి బ్యాటింగ్ చేశారు. కొద్దిసేపు క్రికెట్ ఆడి అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ/వార్డు, మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయిలలో వివిధ దశల్లో 47 రోజులపాటు ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. క్రీడాకారులు సుహృద్భావ వాతావరణంలో క్రీడా స్ఫూర్తిని చాటుతూ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పట్టణంలోని 10, 11, 12వ సచివాలయాల పరిధిలో టీములకు క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. మంత్రి అంబటి రాంబాబు, గుంటూరు జిల్లా మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణలు చేసిన బ్యాటింగ్ క్రీడాకారులలో ఉత్సాహాన్ని నింపింది. మంత్రితో పాటు పార్టీ బాధ్యులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లు, వైసీపీ అనుబంధ సంఘాల బాధ్యులు తదితరులు ఉన్నారు.

బాధితులకు సీఎం ఫండ్ ఆర్థిక భరోసా



విశాలాంధ్ర-సత్తెనపల్లి రూరల్ : నియోజకవర్గం లోని ముప్పాళ్ళ, నకరికల్లు మండలానికి చెందిన ఐదుగురు లబ్ధిదారులకు రూ.3.75 లక్షలు విలువైన చెక్కులను అంబటి స్వయంగా సత్తెనపల్లి పార్టీ కార్యాలయంలో శుక్రవారం అందించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ పేదవర్గాలకు ఆర్థిక భరోసా కల్పించేలా ఆరోగ్యశ్రీ తోడ్పాటు అందిస్తుందని, ఆరోగ్యశ్రీ జాబితాలో లేని వ్యాధు లకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో దోహదపడుతుందని ఆయన వివరించారు. బాధితుల ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. లక్కరాజుగార్లపాడు చెందిన గోపిదేసి సరోజినీకి రూ.3 లక్షలు, చల్లగుండ్ల గ్రామానికి చెందిన గోపు సామ్రాజ్యంకు రూ.1.30 లక్షలు, రూపెనగుంట గ్రామానికి చెందిన మేడా శ్రీనివాసరావుకు రూ.65 వేలు, పెదమక్కెన గ్రామానికి చెందిన వంశీకృష్ణకు రూ.1.80 లక్షలు, పట్టణానికి చెందిన పగడాల విజయలక్ష్మికి రూ.1.70 లక్షలు చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో రాజుపాలెం జడ్పీటీసీ సభ్యురాలు దొంతిరెడ్డి సునీత రెడ్డి, మండల నాయకులు మర్రి సుబ్బారెడ్డి, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు అచ్యుత శివప్రసాద్, రాజుపాలెం మండలం నాయకులు తోట మోహన్‌రావు, గోపిదేసి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి వైఎస్సార్ గ్రామీణ ముగ్గుల పోటీలు

విశాలాంధ్ర-సత్తెనపల్లి : జనవరి 3వ తేదీ నుంచి 6వ తేదీ వరకు గ్రామ, వార్డు స్థాయిలో, జనవరి 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు మండల, మున్సిపాలిటీ స్థాయిలో, జనవరి 12న నియోజకవర్గ స్థాయిలో పెద్దఎత్తున ముగ్గుల పోటీలు నిర్వహించనున్నామని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. శుక్రవారం నియోజవర్గ కార్యాలయంలో జరిగిన పట్టణ పార్టీ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ఇతర ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి మాట్లాడుతూ 2024 సంక్రాంతి ముగ్గుల పోటీల్లో 10 వేల మందికి పైగా పాల్గొనే అవకాశం ఉందన్నారు. పాల్గొన్న ప్రతిఒక్కరికి బహుమతి లభిస్తుందని, అలాగే ప్రతిభ చూపిన మహిళలకు గ్రామస్థాయిలో రూ.3 వేలు, మండల స్థాయిలో రూ.25 వేలు, నియోజకవర్గస్థాయిలో రూ.2 లక్షలు, ద్వితీయ బహుమతి గ్రామస్థాయిలో రూ.2 వేలు, మండలంలో రూ.15 వేలు, నియోజకవర్గంలో రూ.1 లక్ష, మూడో బహుమతిగా గ్రామంలో రూ.1 వెయ్యి, మండలంలో రూ.10 వేలు, నియోజకవర్గంలో రూ.50 వేలు, నాలుగవ బహుమతిగా గ్రామస్థాయిలో రూ.500లు, మండలంలో రూ.5 వేలు, నియోజకవర్గంలో రూ.25 వేలు, ఐదో బహుమతిని కన్సోలేషన్ రూపంలో ఇస్తామని అన్నారు. ముగ్గుల పోటీల ముగింపు వేడుకలలో 12వ తేదీన లక్కీ డిప్ ద్వారా అదృష్టవంతులను ఎంపిక చేసి వారికి ప్రత్యేక బహుమతిగా రూ.15 లక్షల విలువైన హారాన్ని అందిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గీతా హాసంతి, మున్సిపల్ చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి, గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, సహారా మౌలాలి, షేక్ నాగూర్ మీరాన్, కోటేశ్వరరావు నాయక్, పక్కాల సూరిబాబు, పెండెం బాబురావు, రాయపాటి పురుషోత్తమరావు, చల్లంచర్ల సాంబశివరావు, కొణతం స్వాతి, వెలుగూరి శరత్, అచ్యుత శివప్రసాద్, శెట్టి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులు నియంత్రించలేని ముఖ్యమంత్రి దిగిపోవాలి

విశాలాంధ్ర-వినుకొండ: రాష్ట్రంలో మద్యం షాపులను నియంత్రిస్తానని దశలవారీగా ఎత్తివేస్తానని మహిళలకు మాట ఇచ్చి మాట తప్పిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆ పదవి నుండి దిగిపోవాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కోల స్వాతి డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రొబేషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ వద్ద రాష్ట్రవ్యాప్తంగా ఏపీ మహిళా సమాఖ్య, యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ఇచ్చిన పిలుపులో భాగంగా వినుకొండలోని ఎక్సైజ్ స్టేషన్ వద్ద జరిగిన ధర్నాలో స్వాతి పాల్గొని మాట్లాడుతూ ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికల సందర్భంగా తాను అధికారంలోకి వస్తే 2024లో ఎన్నికలు వచ్చేనాటికి అంచలంచలుగా మద్యపాన నిషేధం అమలు చేస్తానని రాష్ట్ర ప్రజానీకానికి మహిళలకు హామీ ఇచ్చారని, ఈ అంశాన్ని ఎన్నికల మేనిఫెస్టోలో కూడా చేర్చారని, కానీ ఇప్పటివరకు మద్యం షాపులను నియంత్రించకుండా మహిళలకు ఇచ్చిన మాటను తప్పి రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి బ్రాండ్ బ్రాందీలను విస్కీల షాపులను విపరీతంగా పెంచి గ్రామీణ ప్రాంతాలలో సైతం బెల్టు షాపులను విపరీతంగా అధికార పార్టీ నేతలు కనుసనల్లో నడుపుతూ వేల కోట్ల రూపాయల అర్జిస్తు తాడేపల్లి ప్యాలెస్‌కు తరలిస్తున్నారని విమర్శించారు. తన సొంత బ్రాండ్లతో ప్రభుత్వమే బ్రాందీ షాపులను నడుపుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే 2024 ఎన్నికల్లో మహిళలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో ఈ ప్రభుత్వం ప్రజలపై అనేక పన్నుల భారాలు వేసిందని ఇంటి పన్ను, నీటి పన్ను, చెత్త పన్ను, విపరీతంగా పెంచి కరెంటు చార్జీలు, ఆర్టీసీ బస్సు చార్జీలు, ఈ ప్రభుత్వం అడ్డగోలుగా పెంచి ప్రజల నడ్డి విరుస్తోందని సామాన్యుడు వాడుకునే నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అందుతున్నాయని మరొకసారి ఈ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజా జీవితంలో కుటుంబాలను పోషించుకోవడం చాలా కష్టతరం అవుతుందని ఈ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా కన్వీనర్ బి.సాగర్ బాబు మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగ వసతులు కల్పించకుండా ఇబ్బందుల పాలు చేస్తున్నారని చదువుకున్న యువత రోడ్డుపాలవుతున్నారని అన్నారు. మహిళా సమాఖ్య పల్నాడు జిల్లా అధ్యక్షురాలు నాగమణి, వినుకొండ నియోజకవర్గ కార్యదర్శి బూదాల చైతన్య మాట్లాడుతూ మహిళలకు ఇచ్చిన మాట తప్పిన ముఖ్యమంత్రి ఎన్నికలలో ఓటు అడిగే హక్కు లేదని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఈ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని వారన్నారు. ధర్నా అనంతరం ప్రొబేషన్ ఎక్సైజ్ ఎస్సై నాగలక్ష్మికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య వినుకొండ అధ్యక్షురాలు ఏ కాశీ లక్ష్మి, ఎం. శారమ్మ, ఎస్.దేవి, కావేరి, కుమారి, నాగమల్లేశ్వరి, జయమ్మ, పల్లె సువార్త, యువజన విద్యార్థి సంఘ కార్యకర్తలు పులి శశి కుమార్, అశోకు, అఖిల్, కిరణ్, సంతోష్, రామ్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకూ పోరు

విశాలాంధ్ర-వినుకొండ: అంగన్వాడీల సమ్మె 18 వ రోజుకు చేరిన సందర్భంగా శుక్రవారం కార్యక్రమం రిలే నిరాహార దీక్షలు చేశారు. హ్యూమన్ రైట్స్ చైర్మన్ కరణం తిరుపతి నాయుడు హాజరై సమస్యకు మద్దతు తెలియజేశారు అలాగే జిల్లా మహిళా సమైక్య అధ్యక్షురాలు నాగమణి కార్యదర్శి కోలా స్వాతి హాజరై ఎన్ని అడ్డంకులు ఎదురైనా మీ న్యాయపరమైన సమస్యలు పరిష్కారం చేసే వరకు సమ్మె నిర్వహించాలని మేము మద్దతు తెలియజేస్తున్నామని అన్నారు. ఏఐటీయూసీ ఏ.మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి శాసనసభ్యులు ఎక్కడా చూడలేదు అని ఎప్పుడు ఎన్ని సమ్మెలు చేసిన ఇలా నిర్బంధం చేయలేదని ఎవరు ఇలా మాట్లాడిన సందర్భం లేదు అని ఇలాగే ఉంటే పర్యవసానం ఆలోచించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమానికి సిఐటియు పట్టణ అధ్యక్షులు ఏ ఆంజనేయులు, బండి కోటయ్య , శారమ్మ, జిల్లా అంగన్వాడి కోశాధికారి లక్ష్మీ ప్రసన్న, ఎస్.కె. మున్ని, పి ఉమాశంకరి , కృష్ణకుమారి, జి పద్మ , శ్రీదేవి , యేసు, మాణిక్యం, నిర్మలమ్మ, జయ, సూర్య హాజరయ్యారు. అనంతరం ముఖ్యమంత్రి కి పోస్టు కార్డుల ద్వారా మా సమస్యలు నెరవేర్చాలని పోస్ట్ బాక్స్ నందు పోస్ట్ కార్డులు పంపారు.

ఓటరు దరఖాస్తుల నమోదు గడువు పెంపు

విశాలాంధ్ర-దుర్గి : ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా షెడ్యూల్ పొడిగిస్తూ ఎన్నికల కమీషన్ ఉత్తర్వులు జారీ చేసిందని తహశీల్దార్, మండల సహాయ ఓటర్ల నమోదు అధికారి జి.రమేష్ కుమార్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఓటర్ నమోదు, అభ్యంతరాలపై బూత్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల నుంచి వచ్చిన అభ్యంతరాలను ఎన్నికల కమీషన్ పరిగణనలోకి తీసుకుని జనవరి 12వ తేదీ వరకు ధరఖాస్తులు విచారణ, ఓటు నమోదు గడువు పొడిగించిదని తహశీల్దార్ చెప్పారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు నుంచి ధరఖాస్తులు స్వీకరించాలని అన్నారు. జనవరి 5వ తేదీన ముద్రించాల్సిన ఓటర్ల తుది జాబితా గడువును ఎన్నికల కమీషన్ పొడిగించిందన్నారు. జనవరి 22వ తేదీన ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల తుది జాబితాను ముద్రించనున్నట్లు తెలిపారు. బీఎల్వోలు రాత్రి, పగలు పని చేయడంతో పెండింగ్ ధరఖాస్తులు అన్ని పూర్తి చేసినట్లు చెప్పారు. బీఎల్వోలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పార్టీలో వలసవాదులను తరిమేయాలి

విశాలాంధ్ర-క్రోసూరు : దేశమంతా వికసిత్ భారత్ వైపు చూస్తుంటే మన ఆంధ్ర బీజేపీ ముఖ్యంగా పల్నాడు, గుంటూరు జిల్లాల భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు, వారి నాయకులు 'ఓటు లేని' బ్యాంకు రాజకీయాలకు తెరలేపారని ఆల్ ఇండియా హిందూ వ్యవస్థ అధ్యక్షురాలు సంఘమిత్ర అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పార్టీని, పార్టీ సిద్ధాంతాలను నమ్ముకుని ప్రజాసేవలో అంకితమైన కార్యకర్తలను, బయట కనిపించని ఎంతోమంది సంఘజీవులను అప్పనంగా తాకట్టు పెట్టి మేక వన్నె పులులు లాగా వ్యవహరిస్తున్న భారతీయ జనతా పార్టీ నాయకులను ఏరివేయాలన్నారు. సిద్ధాంతాలు తెలియని వ్యక్తులను పార్టీలో చేర్చుకొని వారికి పదవులు కట్టబెట్టి జేబులు నింపుకుంటున్న వారు కేవలం రాష్ట్ర పార్టీలకు, ప్రాంతీయ పార్టీలకు, జేబు పార్టీలుగా వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు. పార్టీలోని సీనియర్లను తొక్కి వేసి కేవలం ఆదాయం, కాంట్రాక్టుల కోసం పార్టీలో చేరిన వలసవాదులను వెంటనే తరిమేయాలని డిమాండ్ చేస్తూ జాతీయ అధ్యక్షులు నడ్డాకు పోస్ట్ కార్డు ఉద్యమం ద్వారా భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలో స్వస్థత కోల్పోవడానికి కారణం అవుతున్న కార్పొరేట్ శక్తులకు చరమగీతం పాడే విధంగా చర్యలు తీసుకునేందుకు పోరాటం చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో పుల్లయ్య, కొంగే శ్రీధర్, యేసు రత్నం, రహీమున్నీసా, తస్లీమ్, ధనలక్ష్మి, హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-పెదకూర పాడు : మండల విద్యా శాఖాధికారి ఏకుల ప్రసాదరావు ముఖ్యఅతి థులు మండల విద్యాశాఖాధికారి-2 తాడిశెట్టి సత్యనారాయణ, జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కాకాని రమణ చేతుల మీదుగా ఏపీ ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా విద్యా శాఖాధికారి ఏకుల ప్రసాదరావు మాట్లాడుతూ మండలంలో ఉపాధ్యాయ సమస్యల పట్ల ఎస్టీయూ ఎనలేని కృషి చేస్తున్నదని అన్నారు. ఉపా ధ్యాయ సంఘాలను బలోపేతం చేసుకోవడానికి అందరూ సహకరించాలని కోరారు. సత్యనారాయణ మాట్లాడుతూ ఎస్టీయూ ఉపాధ్యాయ సమస్యలపై కృషి చేస్తున్నదని అభినందించారు. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ న్యామతుల్లా, చాట్ల రవిబాబు ఉపాధ్యాయుల సర్వీస్ పట్ల ఎస్టీయూ నిబద్ధతతో పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పీవీడీ ప్రసాద్, టి.రమేష్, రాధాకృష్ణ, విజయ్ భాస్కర్, ఎస్తేరు రాణి, బేబీ రాణి, వరలక్ష్మి, అనిత, సునీత, హిమని, కవిత, ప్రమీల, సుధాకర్, అభినందన్ రెడ్డి, ఉపేంద్ర, ఝాన్సీ రాణి పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

విశాలాంధ్ర-మాచర్ల : స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఈ నెల 30న సాధారణ కౌన్సిల్ సమావేశం జరగనున్నట్లు మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన్న ఏసోబు తెలిపారు. శుక్రవారం చిన్న ఏసోబు మాట్లాడుతూ సమావేశంలో ఇటీవల జరిగిన క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని పలు ప్రార్థనా మందిరాలలో చేసిన అభివృద్ధి పనులు, కూరగాయలు, సెంట్రల్ మార్కెట్ పాట, మార్కెట్లోని ఖాళీ అయిన పలు షాపుల భర్తీ వంటి ఐదు అంశాలపై కౌన్సిల్‌లో చర్చించి తీర్మానం చేయడం జరుగుతుందన్నారు. సమావేశానికి కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది విధిగా హాజరుకావాలని ఆయన కోరారు.

అంగన్వాడీలకు ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలి: జీవీ

విశాలాంధ్ర-వినుకొండ: వినతి పత్రం ఇచ్చేందుకు శాంతియుతంగా వెళ్లిన అంగన్వాడీల పట్ల ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు దురుసుగా ప్రవర్తించి దూషించి అనుచరులతో దాడి చేయించడానికి టిడిపి తీవ్రంగా ఖండిస్తుందని జిల్లా టిడిపి అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. అంగన్వాడీల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం గత 18 రోజులుగా చేస్తున్న సమ్మెలో భాగంగా జీవి పట్టణంలోని సురేష్ మహల్ వద్ద అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే ఇంటి వద్ద అంగన్వాడీలపై ఎమ్మెల్యే అతని అనుచరులు అంగన్వాడీలపై చేసిన సంఘటనను ఆయన తీవ్రంగా ఖండించారు. మహిళలను గౌరవించడం చేతగాని శాసనసభ్యులు ఇక్కడ ఉండటం బాధాకరమన్నారు. అంగన్వాడి మహిళల పట్ల అనిచిత వ్యాఖ్యలు చేసి దాడి చేయించిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అంగన్వాడీలకు భే శరత్ గా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.ఇంకా ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా సిపిఐ కార్యదర్శి ఏ.మారుతి వరప్రసాద్, టిడిపి నాయకులు పివి సురేష్ బాబు, బత్తుల గోవిందరాజులు, రియల్ ఎస్టేట్ జానీ, జిమ్ జానీ, కాట వెంకట కోటేశ్వరరావు.ఇంకా పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

18 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా చలనం లేదా..?

సింగరకొండ, గంగయ్య

విశాలాంధ్ర - బాపట్ల : న్యాయమైన డిమాండ్లు పరిష్క రించాలని కోరుతూ గత 18 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వంకు సీఎం జగన్మోహన్‌రెడ్డికి చలనం లేదని సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు తన్నీరు సింగరకొండ, సీహెచ్ గంగయ్య మండిపడ్డారు. సీడీపీవో కార్యాలయం వద్ద అంగన్వాడీలు చేస్తున్న సమ్మెకు శుక్రవారం మద్దత్తు తెలిపారు. అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ ఏఐటీ యూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ 3 యూనియన్ల రాష్ట్ర నాయకత్వం ఆధ్వర్యంలో 18 రోజుల నుండి సమ్మె చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా తన్నీరు సింగం కొండ మాట్లాడుతూ 27వ తేదీన రాష్ట్రంలో ఉన్న 10 వామపక్ష పార్టీలు కలిసి సీఎం ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డికి అంగన్వాడీల సమస్యను సానుకూలంగా పరిష్కారం పూర్తి చేయాలని లేఖను రాయటం జరిగిందన్నారు. జనవరి ఒకటి నుండి పలు ప్రభుత్వ శాఖల సహకారంతో అంగన్వాడి సెంటర్లను తెరిచి ప్రస్తుతం ఉన్న అంగన్వాడలకు అన్యాయం చేస్తే ఊరుకోమనిలీ ఘటనలను సిపిఐ బాపట్ల జిల్లా తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఉడత ఊపులకు, తటాకు చప్పుడలకు ఆదరం బెదరం అని గత ప్రభుత్వాల మెడలోంచి 100, 250 ఉన్న జీతాలను 11500 రూపాయలను పోరాటాల ద్వారానే సాధించుకున్నామని గుర్తు చేశారు. గొంతెమ్మ కోరికలు కాదని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పాదయాత్రలో ఇచ్చిన హామీలులనే నెరవేర్చాలని, నెరవేర్చలేని పక్షంలో 2024లో ఇంటికి సాగనంపుతామని వైసీపీ ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ చేస్తున్న కార్యక్రమాలు అన్నిటికీ సిపిఐ బాపట్ల జిల్లా సమితి సంపూర్ణ మద్దతును, హామీలన్నీ నెరవేర్చేదాక ప్రత్యక్షంగా పరోక్షంగా పోరాటంలో అగ్రభాగాన ఉంటామని హామీ ఇచ్చారు.

కేఆర్‌కే విద్యార్థికి రజత పతకం

విశాలాంధ్ర-అద్దంకి; స్థానిక కెఆర్‌కె ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి జి. బాలజనార్ధన్ నాగార్జున విశ్వవిద్యాలయం నిర్వహిం చిన 20 కి.మీ పరుగు పందెలో రజత పతకం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి,మోహనరావు తెలిపారు. జనార్ధన్‌ను శుక్రవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

విశాలాంధ్ర-అద్దంకి ; రోటరీ క్లబ్ ఆఫ్ సింగర కొండ ఆధ్వర్యంలో స్థానిక ఎస్టీ రెసిడెన్సియల్ పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు శుక్రవారం ఎగ్జామ్ స్టడీ మెటీరియల్, ఎగ్జామ్ పాండ్స్‌ను బహుకరించారు. రోటరీ పూర్వ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివారావు మనుమరాలు సాత్విక పుట్టిన రోజు సందర్భముగా శ్రీనివాసరావు బహుకరించినట్లు రోటరీ అధ్యక్షులు మలాది శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి,విద్యార్దులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మె కొనసాగింపు

విశాలాంధ్ర - పర్చూరు : సీడీపీఓ కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్య కర్తలు చేస్తున్న ధర్నా 18వ రోజుకి చేరుకుంది. శుక్రవారం మోకాళ్లపై నిలబడి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. తమకు జీతాలు పెంచి నాల్గవ తరగతి ఉద్యోగులుగా గుర్తిం చాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గౌరవ వేతనం వద్దు కనీస వేతనం ఇవ్వాలంటూ నినాదాలు చేశారు. తమ న్యాయమైన కోర్కెలు నెరవేరేంత వరకు ధర్నాను కొనసాగిస్తామని తేల్చిచెప్పారు. అంగన్వాడీల ధర్నాకు పలు ప్రజా సంఘాలు మద్దతు తెలిపాయి.

గోవా మద్యం స్వాధీనం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : స్థానిక బస్ స్టాండ్ వద్ద విజయవాడ నుండి చీరాల వచ్చిన బస్సులో గుర్తు తెలియని వ్యక్తులు తీసుకుని వస్తున్న మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని సెబ్ కార్యాలయానికి తరలించారు. ఈ సందర్భంగా సెబ్ కార్యాలయంలో సీఐ సోమయ్య మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. గోవా నుండి తీసుకువస్తున్న 50 మద్యం ఫుల్ బాటిళ్లను, 260 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మద్యం బాటిళ్లు తీసుకుని వస్తున్న వ్యక్తులు పరారీలో ఉన్నారని, త్వరలోనే పట్టుకుంటామన్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పదవ తరగతి కీలకమెట్టు

విశాలాంధ్ర - చీరాల : ప్రతీ విద్యార్థికి పదవ తరగతి కీలక మెట్టని, విద్యార్థులు పదవ తరగతి చక్కగా చదివి మంచి ఫలి తాలు పొందాలని పేరాల హైస్కూల్ ప్రధానో పాధ్యాయులు బి సాల్మన్ రాజు అన్నారు. శుక్రవారం పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకి ఆంగ్ల ఉపాధ్యాయులు కె.సుబ్రమణ్య కుమార్ సహకారంతో ఉచిత అభ్యసన సామగ్రిని అందజేశారు. పవని భానుచంద్ర మూర్తి, విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

భయభక్తులు కలిగి జీవించాలి

విశాలాంధ్ర - పర్చూరు : దేవుని యందు భయ భక్తులు కలిగి ఆశీస్సులు పొందాలని చినగంజాం గ్రామ పంచాయతీ సర్పంచ్ రాయని ఆత్మ రావు అన్నారు. శుక్రవారం చినగంజాం అంబేద్కర్ నగర్ లో నిర్వహించిన క్రీస్తు పాటల పోటీలలో విజేతలైన చప్పిడి నిహాల్, మేడికొండ రాజ్ కుమార్, చప్పిడి అభిలాష్, మార్పు యశ్వంత్, మేడికొండ నాని లకు సర్పంచ్ ఆత్మ రావు, వార్డు సభ్యుడు మార్పు సుకుమార్, చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రికార్డు అసిస్టెంట్ మేడికొండ సాంబశివరావు ల చేతుల మీదుగా బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో క్యారల్స్ నిర్వహకుడు మేకల మేషక్ బాబు, కందుల వృద్ధి, కట్టా దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర - చీరాల : ప్రవేటు పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు తెలుసుకునేందుకు ఆకస్మిక తనిఖీ నిర్వహించామని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ మెంబర్ బత్తుల పద్మావతి అన్నారు.శుక్రవారం చీరాల పట్టణంలోని నారాయణ, చైతన్య పాఠశాలలు, ఈపురుపాలెం జడ్పీ హైస్కూల్ ను ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా బత్తుల పద్మావతి మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని సదుపాయాలు సక్రమంగా అందించాలన్నారు.చైతన్య పాఠశాలలో 750 మంది పిల్లలకు ఫ్లోర్ కి వచ్చి ఒక్క టాయిలెట్ మాత్రమే ఉందని కనీస పరిశుభ్రత లేదన్నారు.స్కూలు యాజమాన్యం కనీస జాగ్రత్తలు పాటించాలని, పిల్లలకు రక్షణ సౌకర్యాలు కల్పించాలని అన్నారు.

చిరస్మరణీయురాలు వెలగపూడి సరస్వతమ్మ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల ప్రాంతం లో స్త్రీ విద్యవ్యాప్తి కి విశేషంగా కృషి చేసిన వారిలో అగ్రగన్యులు వెలగపూడి సరస్వతమ్మ అని ఫోరం కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు అన్నారు.

సరస్వతమ్మ జయంతి సందర్భంగా శుక్రవారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో ఎస్ ఎంజి జూనియర్ కళాశాల వద్దనున్న ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1915లో ప్రారంభించబడిన యువతి విద్యా నిలయం నేడు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలగా మారి అభివృద్ధికి సరస్వతమ్మ తన జీవిత సర్వస్వాన్ని అర్పించారన్నారు. పట్టణం నడిబొడ్డున అర ఎకరం స్థలాన్ని ఆ విద్యా సంస్థకు విరాళంగా ఇచ్చారని స్త్రీ జనాభివృద్ధికి ఆమె చేసిన కృషి అనన్య సామాన్యమైనదన్నారు. ఆమె త్యాగనిరతి నిరుపమానమైనదని ఆ విద్యాసంస్థల్లో చదివిన మహిళలు ఆమెను స్ఫూర్తిగా తీసుకొని మహిళాభివృద్ధికై పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.వేదవతి, అధ్యాపకులు ఉదయభాస్కర్, జాన్‌సైదా, శ్రీనివాసరావు,సుమతి, సంయుక్త, సువర్ణ విద్యార్థులు పాల్గొన్నారు.

అవకాశాలతో ఉన్నతంగా ఎదగాలి: కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : ప్రభుత్వం కల్పించే అవకాశాలు, ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా చెప్పారు. జిల్లాలోని విద్యార్థులకు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి చేతుల మీదుగా చెక్కు రూపంలో నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన పథకాలు విద్యార్థులకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తున్నాయని తెలిపారు. విద్యాభివృద్ధికి ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి పథకాలు, అవకాశాలు లేవని, విద్యార్థులు సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. నాణ్యమైన విద్యను విద్యార్థులకు అందించడానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యా బోధన అందిస్తూ విద్యా రంగంలో సమూల మార్పులు తెచ్చారన్నారు. జగనన్న విద్యా దీవెన పథకం కింద జిల్లాలోని పేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీ, కాపు సామాజిక వర్గానికి చెందిన 25,973 మంది విద్యార్థులకు రూ.20.73 కోట్ల నగదు విడుదలైందన్నారు. ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి నాణ్యమైన విద్య అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని అన్నారు. విద్య భారం కారాదనే దృక్పథంతో విద్యార్థుల కోసం అనేక పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశపెట్టారన్నారు. ముఖ్యంగా విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు జరుగుతున్నాయన్నారు. మానవ వనరుల అభివృద్ధితోనే రాష్ట్రం పురోభివృద్ధిలో పయనిస్తుందని నమ్మిన గొప్ప వ్యక్తి రాష్ట్ర ముఖ్యమంత్రి అని చెప్పారు. ఆ దిశగా పేదలకు ఉన్నతమైన విద్య అందిస్తున్నారని తెలిపారు. మరోవైపు వారి సంక్షేమానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. పేదల పక్షాన నిలిచి పనిచేసే ప్రభుత్వముగా వైసిపి ఏపీలో చెరగని ముద్ర వేసుకున్నట్లు ఆయన వివరించారు. పేద విద్యార్థులకు ప్రభుత్వం ఎంతో మేలు చేస్తుందన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిని జె.రాజాదిబోరా, బీసీ సంక్షేమశాఖ అధికారి బి.అర్జున్ రావు, పర్యవేక్షకులు ఆంధ్ర శ్రీనివాసులు, అధికారులు, పేర్లీ సునీల్ గ్రూప్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

ధరలకనుగుణంగా జీతాలు పెంచాలి: కేసన

విశాలాంధ్ర - బాపట్ల : పెరుగుతున్న ధరలకు తగిన విధంగా జీతభత్యాలను పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మె శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు ఎంప్లాయిస్‌ను పర్మినెంట్ చేస్తానని పాదయాత్ర జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామిను నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వారికి హెచ్‌ఆర్‌ఏ నిబంధన ప్రకారం అన్ని హక్కులను కల్పించాలని కోరారు. జీవో నెంబర్ 65 ను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వానికి ఆయన విజ్ఞప్తి చేశారు. కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ఎదుర్కొంటున్న సమస్యలను మరో రెండు రోజుల్లో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని కలిసి వివరిస్తానని ఆయన ప్రకటించారు. వారు చేస్తున్న సమ్మెకు తమ బీసీ సంక్షేమ సంఘం మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాపట్ల రవికుమార్, జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్దిబోయిన తాతయ్య, ఉపాధ్యక్షులు జొన్నాదులు వెంకటేశ్వరరావు, జిల్లా న్యాయ సలహాదారుడు అంగలకుదురు నటరాజన్, కార్యదర్శి మారం రవికుమార్, పట్టణ యువజన అధ్యక్షుడు ఉప్పలదిన్నే గోపినాథ్, నాయకులు పరిశా రమేష్ గౌడ్, నాయకులు మారం భాను తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రభుత్వానికి రోజులు ముగింపు: వేగేశన

విశాలాంధ్ర - బాపట్ల : వైసీపీ ప్రభుత్వానికి రోజులు ముగిశాయని ప్రజలు ఇంటికి పంపేందుకు సిద్ధంగా ఉన్నారని టీడీపీ ఇంచార్జీ వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. ఇంటింటికి తెలుగుదేశం మీ మాటే - నా బాట,భవిష్యత్ కు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలోని దేవుడుమాన్యం , బాపట్ల మండలం మూలపాలెం గ్రామంలో మహిళలకు చీర, నిత్యావసర వస్తువులు తెచ్చుకునే సంచి అందజేసి ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా నరేంద్ర వర్మ మాట్లాడుతూ అభివృద్ధి ధ్యేయంగా పాలన అందించే తెలుగుదేశం ప్రభుత్వానికి ప్రజలు పట్టం కట్టాలన్నారు. నియోజకవర్గంలోని నిరుద్యోగులకు ప్రత్యేకంగా ఉద్యోగ అవకాశాలు కల్పించే బాధ్యత తనదని ఆయన హామీ ఇచ్చారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీని అత్యధిక మెజారిటీతో గెలిపించి ఆశీర్వదించాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ వజ్రోత్సవాలు విజయవంతం చేయండి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఎస్టీయూ 75 సంవత్సరాల వజ్రోత్సవ సంబరాలు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో జనవరి 12,13 తేదీలలో కర్నూలు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరుగుతుందని ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు బడుగు శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి జి. అమర్నాథ్ తెలిపారు. వజ్రోత్సవ సంబరాల గోడ పత్రికను ఎస్టీయూ జిల్లా కార్యాలయం శుక్రవారం ఆవిష్కరించారు. బడుగు శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాయ వాణి కన్వీనర్ వి.నాగరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు జి.ఉదయ శంకర్, మైనార్టీ కన్వీనర్ నూరుబాషా సుభాని,బాపట్ల మండల అధ్యక్షులు ఏ.వి నారాయణమూర్తి, జిల్లా కౌన్సిలర్ ఏవి నారాయణ, పీవీ పాలెం మండలం అధ్యక్షులు ఏం. ప్రభాకర్ పాల్గొన్నారు.

మాజీ సైనికునికి మరణ శిక్ష రద్దు హర్షణీయం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ఖతర్ దేశంలో నిర్బందించబడి మరణ శిక్ష విధించబడిన భారతదేశ మాజీ సైనికుల మరణ శిక్షను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయించటంపై మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు తాంద్ర సాంబశివరావు హర్షం వ్యక్తం చేశారు. భారతీయ నావికాదళంలో ఉద్యోగ విరమణ అనంతరం, అల్ దాహ్రా గ్లోబల్ టెక్నాలజీస్ అనే ఖతార్ దేశపు కంపెనీలో ప్రైవేట్ ఉద్యోగం చేసుకోవటానికి ఖతార్ దేశం వెళ్ళిన 8 మంది భారతీయ మాజీ సైనికులను ఖతార్ దేశం నిర్బంధించి అమానుషంగా గూఢచర్య నెపం మోపారన్నారు. మరణ శిక్షను రద్దు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టడం ఆనందించదగ్గ విషయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు సుంకర శేషగిరి రావు, డి వెంకటేశ్వర్లు, కృష్ణా రావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమ్మెకు రాజకీయ పార్టీల మద్దతు

విశాలాంధ్ర - రేపల్లె : అమ్మల తరువాత అమ్మ లాంటి అంగన్వాడీలు తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని ఆందోళన చేస్తుంటే ప్రభుత్వం అంగన్వాడీల పట్ల పాలకులు తప్పుడు ప్రచారాలకు పూనుకోవడం దుర్మార్గమని ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి ఎస్. హనుమంతరెడ్డి అన్నారు. స్థానిక తాలూకా కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయుసి)ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి 18వ రోజుకు చేరింది. శుక్రవారం హనుమంతరెడ్డి సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. సలహాలు ఇవ్వని సలహాదారులకు నెలకు రూ. 3 లక్షలకు పైగా జీతాలు ఇస్తున్న ప్రభుత్వం శ్రమ పడుతున్న అంగన్వాడీలకు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు ఇవ్వడానికి ఇది సమయం కాదని చెప్పడం సిగ్గుచేటని ఆయన అన్నారు.

గోమాతకు వినతిపత్రం

మాట తప్పను మడమతిప్పను అంటూ అంగన్వాడీలకు జగన్నన ఇచ్చిన హామీలను అమలు చేసేలాచూడు అంటూ వినూత్న రీతిలో గోమాతకు వినతిపత్రం సమర్పించారు. మా సమస్యలను పరిష్కరించేవరకు సమ్మెను విరమించేదిలేదని అంగన్వాడీలు హెచ్చరించారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ఎంపి జెడి శీలం కాంగ్రెసు పార్టీ నాయకులు, కార్యకర్తలబృందంతో కలసి సమ్మె శిబిరాన్ని సందర్శించి సంపూర్ణ మద్దతు తెలియజేశారు. అంగన్వాడీల నాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి కేసన రామకోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : కుష్టు వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్వైజర్ మురళి సూచించారు. కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్ర మంలో భాగంగా శుక్రవారం మండలంలోని కొత్తపాలెం గ్రామంలోని సంజీవనగర్ లో అనుమానస్పద కుష్టు వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించే సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చర్మంపై స్పర్శ లేని మచ్చలు, మందమైన మెరిసే జిడ్డుగల చర్మం, చెవులు వీపు ఎదలపై నొప్పిలేని బొడిపెలు తదితర లక్షణాలు ఉంటాయని అనుమానాలు ఉంటే వెంటనే ఆరోగ్య కార్యకర్త వద్ద లేదా సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యశాలకు వెళ్లి వైద్యులను సంప్రదిస్తే వారు వ్యాధిని గుర్తించి అవసరమైన మందులను ఉచితంగా అందిస్తారని తెలిపారు. తద్వారా వ్యాధిని పూర్తిగా నయం చేయొచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ, ఎంపీహెచ్‌ఎస్, ఏఎన్‌ఎం లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కోడి కత్తి శీనుపై కేసు ఎత్తివేయాలి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : కోడి కత్తి శీనుపై కేసును ప్రభుత్వం వెంటనే ఎత్తివేయాలని అంబెడ్కర్ యువజన సంఘం కన్వీనర్ గుదే రాజారావు తెలిపారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ 2018వ సంవత్సరం అక్టోబర్ నెల 25 వ తేదీన విశాఖపట్నం ఎయిర్ పోర్ట్‌లో ప్రతి పక్షనేతగా ఉన్న జగన్‌పై జనపల్లి శ్రీనివాస్ రావు అనే ఎస్సీ యువకుడు కోడి కత్తితో దాడి చేశాడని ఐదున్నర సంవత్సరం కావస్తున్న ఈ కేసులో కోడి కత్తి శ్రీనుకు బెయిల్ రాకుండా చేస్తున్నారన్నారు. ఈ కేసులో విచారణ చేస్తున్న ఎన్‌ఐవి కోర్టు లో కుట్రకోణం లేదని ఎన్‌ఐఎ ఏజెన్సీ వారు కోర్టుకు నివేదిక ఇచ్చారన్నారు. ఎన్‌ఐఎ చట్టం సెక్షన్ 7 క్లాజు బి ప్రకారం ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ కు ఈ కేసును బదిలీ చేశారన్నారు. ఎస్సీ ఎస్టీ ఆల్ ఇండియా అసోసియేషన్ అధ్యక్షులు పర్రె కోటయ్య మాట్లాడుతూ కోడి కత్తి శ్రీను పై వెంటనే కేసు ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుల వ్యతిరేక పోరాట సమితి జిల్లా కన్వీనర్ కోలా శరత్, చింతా ఫ్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములు అన్యాక్రాంతం...

గుమ్మడి ఏసురత్నం

విశాలాంధ్ర - చీరాల : చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులే దురాక్రమణ దారులకు అండగా నిలుస్తున్నారని, ఒకవైపు పేదల ప్రభుత్వం మనదని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చెబుతుంటే చీరాల రెవెన్యూ అధికారులు మాత్రం భూస్వాములతో లాలూచీ పడి ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములు అప్పనంగా అప్పజెబుతున్నారని ప్రజా వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు గుమ్మడి ఏసురత్నం అన్నారు. చీరాల మసీదు సెంటర్ లోని ప్రజా వేదిక కార్యాలయంలో గుమ్మడి ఏసురత్నం, దళిత బహుజన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ జిలానిలు మాట్లాడుతూ అన్యాక్రాంతమైన అసైన్డ్ భూమి ఈపురుపాలెం గ్రామ రెవెన్యూ సర్వే నంబర్ 798/2-3లో అంబేద్కర్ విగ్రహం, సామాజిక భవన ఏర్పాటుకు 20 సెంట్లు స్థలం కేటాయించాలని స్వయానా బాపట్ల ఎంపీ నందిగం సురేష్ జిల్లా కలెక్టర్ కు సిఫార్సు చేసినా అధికారులు మాత్రం నేటికి స్థల కేటాయింపు జరపలేదన్నారు. గత మూడేళ్ళుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు మాత్రం దురాక్రమణదారులకు అండగా ఉంటూ నేటికి కేటాయించలేదన్నారు. స్వయానా రాష్ట్ర ఎస్‌సి సెల్ అధ్యక్షుడు బాపట్ల ఎంపీ నందిగం సురేష్ బాపట్లజిల్లా కలెక్టర్‌కు సిఫార్సు చేసిన చీరాల రెవెన్యూ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ నేటికి కేటాయించ లేదని, ఎంపీ ఆదేశాలకే దిక్కు లేకపోతే సామాన్య ప్రజలకు రెవెన్యూ సిబ్బంది చేస్తున్న సేవలు ఎలా ఉన్నాయో ప్రజలు అర్థం చేసుకోవచ్చన్నారు. దురాక్రమణ దారులకు పిఓటి చట్టం ప్రకారం నోటీసులు జారీ చేసి దురాక్రమణ దారులు సంప్రదింపులు జరిపాక నేడు అసలు మేమేం చేయలేమని రెవెన్యూ అధికారులు చెబుతున్నారంటే వీరి పని తీరు ఏ విధంగా ఉందొ అర్థం అవుతుందన్నారు. చట్టాలు అమలు చేయాల్సిన అధికారులు ప్రజలకు ఎంత జవాబుదారీతనంతో పని చేస్తున్నారో ఆలోచించుకోవాలన్నారు.తోటవారిపాలెం గ్రామ పంచాయతీలో సర్వే నంబర్ 801,787లో దురాక్రమణదారులు ప్రభుత్వ భూములు ఆక్రమించుకొని పక్క కట్టడాలు నిర్మిస్తున్న అధికారులు చోద్యం చూస్తున్నారు కాని చర్యలేమి తీసుకోవట్లేదని, అంబేద్కర్ భావజాలమని మాటలు చెప్పే ఈ సోకాల్డ్ అంబేద్కర్ వాదులు ఆయన పేరు చెప్పుకొని సొమ్ము చేసుకుంటున్నారని పిఓటి చట్టన్ని అమలు చేయకుంటే ఉద్యమాన్ని రూపొందిస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే అన్యాక్రాంతమైన అసైన్డ్ భూమిలో ఎంపీ నందిగం సురేష్ ఆదేశాల మేరకు అంబేద్కర్ విజ్ఞాన వికాస కేంద్రంకి స్థలం కేటాయించాలని లేదంటే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో కాగిత ఆదాము,గుమ్మడి ఏసోబు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

అరాచక పాలన అంతం.. రాష్ట్ర అభివృద్ధి తథ్యం

విశాలాంధ్ర - యద్దనపూడి : అరాచక పాలన అంతమై రాష్ట్రాభివృద్ధి తథ్యం అని పర్చూరు నియోజక వర్గం ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మండలంలోని పూనూరు గ్రామానికి చెందిన 40 కుటుంబాల వారు వైసీపీ నుండి టిడిపి లో మండల రైతు ఉపాధ్యక్షులు వీరపనేని వాసు నేతృత్వంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమక్షంలో వైసీపీ నాయకులు వంకాయలపాటి సుబ్బారావు, పంచాయతీ వార్డు నెంబర్ పాలపర్తి రాధా పావులూరి, శివాజీ టిడిపిలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువా కప్పి పార్టీలకు చేర్చుకున్నారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరు కష్టపడి పని చేయాలన్నారు. నాయకులంతా సమన్వయంతో పని చేయాలన్నారు .ప్రజల భవిష్యత్తు కోసం తెలుగుదేశం పార్టీ ఆరు పథకాలను రూపు కల్పన చేసిందని, అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి లక్ష్యంగా తెలుగుదేశం ప్రభుత్వం కృషి చేస్తుందని అరాచక పాలన అంతం కోసం ప్రజలంతా తెలుగుదేశంతో కలిసి రావాలని అన్నారు. పూనూరు గ్రామా అభివృద్ధి కి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నల్లపునేని రంగయ్య చౌదరి, రాయపాటి సీతయ్య, వీరప్పనేని వాసు, వంకాయపాటి సుబ్బారావు పావులూరు శివాజీ, పాలపర్తి రాధ,కావూరి హనుమంతరావు, బ్రహ్మం, కే.సుబ్బయ్య, కే .అంజయ్య, ఏ. వెంకట్రావు, కే. అదియ్య, పి. హనుమంతరావు ,పి. పరశురాముడు, వీరాంజి, లోకేష్, వెంకట్రావు ,గోపి ,కాశి శంకర్ ,శివరాం ,బోయపాటి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధే కాంగ్రెస్ ఆశయం: జేడీ శీలం

విశాలాంధ్ర - రేపల్లె : రాష్ట్ర అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ ఆశయమని కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ జేడీ శీలం వ్యాఖ్యనించారు. శుక్రవారం పట్ట ణంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. తొలుత భారత మాజీ ప్రధాని స్వర్గీయ పండిట్ జవహర్లాల్ నెహ్రూ విగ్రహానికి, రాజీవ్ గాంధీ విగ్రహానికి, మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహానికి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి పట్టణంలో నిరవధిక దీక్షలు చేస్తున్న లాయర్లకు, అంగన్వాడీలకు సంఘీభావం తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర విభజన తరువాత అధికారంలోకి వచ్చిన ప్రాంతీయ పార్టీలు 10 సంవత్సరాల కాలంలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాయని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని ఎదిరించలేక ప్రాంతీయ పార్టీల నాయకులు తలలువంచి మోదీ జపం చేశారని విమర్శించారు. ఆంధ్రులకు అన్యాయం జరగకూడదని ఆనాడు సోనియాగాంధీ పలు అంశాలతో చట్టం రూపొందించారని చెప్పారు. రానున్న రోజుల్లో రాహుల్ గాంధీ నాయకత్వంలో ఇండియా కూటమి బలోపేతం అవుతుందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ కేసన రామకోటేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే విభజన చట్టంలోని అన్ని హామీలను అమలు చేస్తామని తెలిపారు. ప్రత్యేక హెూదా, పోలవరం నిర్మాణం, విశాఖ ఉక్కును పరిరక్షణ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆంధ్రలో ప్రజారంజక పాలన చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే పార్టీ అధిష్టానం ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి కొరకు ఏడు అంశాలతో కూడిన ప్రణాళికలను సిద్ధం చేసినట్లు చెప్పారు కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిల వసూళ్లకు చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - అద్దంకి : డివిజన్ పరిధిలో పేరుకుపో యిన విద్యుత్ బకాయిల వసూళ్లకు వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యుత్ శాఖ సూపర్ ఇంటిండి ఇంజనీర్ సత్యనారాయణ అధికారులను ఆదేశించారు శుక్రవారం స్థానిక విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో విద్యుత్తు రెవెన్యూ కలెక్షన్స్ మరియు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు సంబంధించి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ అద్దంకి డివిజన్ పరిధిలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం డీడీలు చెల్లించిన రైతులకు వెంటనే విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అద్దంకి మార్టూరు డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు. ఏ ఈ లు. సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : యూటీఎఫ్ పిట్టలవానిపాలెం మండల శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీ, క్యాలెండర్, వాల్ స్టిక్కర్లు ఉపాధ్యాయులకు ఎంత గానో ఉపయోగపడతాయని మండల విద్యాశాఖ అధికారి ఎంఈఓలు 1,2 ఉయ్యూరు వెంకటేశ్వరరావు, రాజారత్నం అన్నారు. యూటీఎఫ్ మండల శాఖ రూపొందించిన డైరీ , క్యాలెండర్, వాల్ స్టిక్కర్లను శుక్రవారం పిట్టలవానిపాలెంలో ఎంఈఓలు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షులు మహమ్మద్ రహమతుల్లా, సహాధ్యక్షులు టి.శ్రీనివాసరావు, మహిళా సహాధ్యక్షురాలు బర్కతున్నిసా, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రాఖిబుద్దిన్, ఆర్థిక కార్యదర్శి మహమ్మద్ ఆషరఫ్ అలీ, యుటిఎఫ్ కార్యవర్గ సభ్యులు నాగ సుబ్బయ్య, సయ్యద్ ఖాసిం, మక్బుల్, సుభాని, రత్నం, సయ్యద్ షబానా, షేక్ ఖమర్ జహాన్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం



విశాలాంధ్ర - బాపట్ల : దివ్యాంగుల సంక్షేమానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని జిల్లా జాయింట్ కలెక్టర్ గౌరవనీయులు సిహెచ్ శ్రీధర్ ఐఏఎస్ గారు అన్నారు.శుక్రవారం బాపట్ల కలెక్టరేట్లోని స్పందన హాల్లో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.అర్చన అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో తొలుత జ్యోతి ప్రజ్వలన ప్రార్థనా గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ మాట్లాడుతూ దివ్యాంగుల అభివృద్ధి సంక్షేమానికి కృషి చేస్తానని వివరించారు. విభిన్న ప్రతిభావంతులు వయోవృద్ధుల సహాయ సంస్థ చైర్మన్ కుమారి ముంతాజ్ పటాన్ మాట్లాడుతూ దివ్యంగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ ఏడాది 1750 మూడు చక్రాల మోటార్ సైకిల్ లను దివ్యాంగులకు అందజేయనున్నట్లు తెలిపారు. వైఎస్‌ఆర్‌పి వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య, దివ్యాంగుల అసోసియేషన్ నాయకులు షేక్ కాలేశా, గోగన ఆదిశేషు, నటరాజ్ తదితరులు దివ్యాంగులు సమస్యలను సభకు వివరించారు. అదేవిధంగా స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు వెంకన్న బాబు తదితరులు దివ్యాంగుల సంక్షేమానికి చేస్తున్న సేవా కార్యక్రమాలు వివరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి పి వి జె రామారావు ,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు. అనంతరం 10మందికి ట్రై సైకిళ్లు, 5గురికి వీల్ చైర్స్, మరో 10మందికి చంక కర్రలును జాయింట్ కలెక్టర్ శ్రీధర్ లబ్ధిదారులకు ఉపకరణాలు పంపిణీ చేశారు.